teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 93 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 10 సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## ఉపరాష్ట్రపతి ఎన్నికలో సీపీ రాధాకృష్ణన్ విజయం

### 152 ఓట్ల తేడాతో గెలుపు



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే కూటమి తరపున పోటీ చేసిన సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించారు. ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై ఆయన 152 ఓట్ల తేడాతో విజయం సాధించారు. సీపీ రాధాకృష్ణన్ కు 452 ఓట్లు రాగా, జస్టిస్ సుదర్శన్ రెడ్డికు 300 ఓట్లు వచ్చాయి. 15 ఓట్లు లెక్కలోకి రాలేదు. కాగా పార్లమెంట్‌లో మొత్తం ఓటర్లు 781 మంది ఎంపీలు ఉండగా767 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికకు బీఆర్ఎస్, బీజేడీ పార్టీలు దూరంగా ఉన్నాయి.

## తెలంగాణలో భిన్న వాతావరణ పరిస్థితులు

### రికార్డ్ స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు
### సాయంకాలం సమయంలో వర్షాలు

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావం

అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచన



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. మొన్నటిదాకా భారీ వర్షాలు దంచికొడితే ఇప్పుడు ఒక్కసారిగా ఎండ తీవ్రత పెరిగింది. రికార్డ్ స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో వాతావరణ పరిస్థితి

మిగతా 2 లో

## గ్రూప్-1 ర్యాంకుల నిలిపివేత






### గ్రూప్ -1 మెయిన్స్ ఫలితాలపై హైకోర్టు సంచలన తీర్పు

### మెయిన్స్ పేపర్ల రీవాల్యుయేషన్‌కు ఆదేశం

గత ఏప్రిల్‌లో టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలను ప్రకటించింది. అయితే, మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ కొంత మంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. మెయిన్స్ పరీక్షలను రద్దు చేయాలని వారు కోర్టును అభ్యర్థించారు. అభ్యర్థుల పిటిషన్లపై జరిపిన విచారణ అనంతరం, కోర్టు మెయిన్స్ పేపర్లను తిరిగి మూల్యాంకనం చేయాలని, తద్వారా పారదర్శకంగా ఫలితాలను ప్రకటించాలని ఈ సంచలనాత్మక తీర్పును వెలువరించింది. హైకోర్టు తాజా తీర్పుతో వేలాది మంది గ్రూప్-1 అభ్యర్థులలో కొత్త ఆశలు చిగురించాయి.

02





గ్రూప్-1 ఫలితాలపై

### హైకోర్టు సంచలన తీర్పు

జనరల్ మెరిట్ లిస్ట్‌ను రద్దు చేస్తూ కోర్ట్ నిర్ణయం

8నెలల్లో రివాల్యూయేషన్ చేయాలని టీఎస్‌పీఎస్సీకి ఆదేశాలు

సాధ్యం కాకపోతే గ్రూప్-1 పరీక్షలు నిర్వహించాలని స్పష్టం

సోషల్ మీడియా వేదికగా హరీష్ రావు చివాట్లు

.. వివరాలు 2లో

## కేటీఆర్‌ను కలవాలంటే సీఎం రేవంత్ రెడ్డిని అడగాలా

కేటీఆర్‌ను ఎందుకు కలవకూడదు

కేటీఆర్‌తో ఇటీవల భేటీ కావడంపై స్పందించిన లోకేశ్

02





## కేటీఆర్‌కు బిగ్ రిలీఫ్

వేర్వేరు స్టేషన్లలో కేసులను కొట్టేసిన ఉన్నత న్యాయస్థానం

.. వివరాలు 2లో




నంబాల కేశవరావు

## స్థానంలో కొత్త సెక్రటరీ

ప్రకటన విడుదల చేసిన మావోయిస్టు పార్టీ

మూడున్నర నెలల తర్వాత పార్టీకి కొత్త సెక్రటరీ

.. వివరాలు 2లో



## ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఓటమి

ఓటమి నేపథ్యంలో సంచలన లేఖ విడుదల

ఎన్నిక తీర్పును సవినయంగా స్వీకరిస్తున్నా

.. వివరాలు 2లో



## ఈసారి పది రోజుల పాటు బతుకమ్మ

### తిథి ద్వయం కారణంగా ఒక రోజు అదనం

ఈ నెల 21 నుండి 30 వరకు జరగనున్న సంబరాలు

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): పూలనే పూజించే ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ తెలంగాణలోని ఆడపడుచులకు బతుకమ్మతో విడదీయరాని

మిగతా 5 లో

## పార్టీ మారిన ఎమ్మెల్యే ఏ లింగమో..?

పీసీసీ చీఫ్ నేరాంగీకారం చేశాక చర్చ దేనికి?

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై కేటీఆర్ వివాదాస్పద వ్యాఖ్యలు

02





## కూలిన హాస్టల్ భవనం

### మునిపల్లి మండలం లింగంపల్లిలో పెను ప్రమాదం

ముగ్గురు విద్యార్థులకు తీవ్రగాయాలు

భోజనానికి వెళ్లడంతో బ్రతికి బయటపడ్డ విద్యార్థులు

ఘటన స్థలాన్ని సందర్శించిన కలెక్టర్

సహాయక చర్యలు పర్యవేక్షించిన అధికారులు

నూతన భవనం నిర్మించాలని డిమాండ్

ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



సంగారెడ్డి, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లిలో ఘోర ప్రమాదం జరిగింది. గ్రామంలోని బాలుర గురుకుల హాస్టల్ భవనం మంగళవారం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు తీవ్రగాయాలు అవ్వగా.. పలువురు తృటిలో ప్రాణాలు దక్కించుకున్నారు. హాస్టల్ సిబ్బందితోపాటు స్థానికులు

మిగతా 2 లో

## ఫార్ములా ఈ- రేసు కేసులో కీలక పరిణామం

పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేసిన ఏసీబీ

చార్జిషీట్ దాఖలుకు గవర్నర్ అనుమతి కోసం రిపోర్టు



02



## నిర్మలా సీతారామన్‌తో సీఎం రేవంత్ భేటీ

పంట, ఆస్తి నష్టంపై నివేదకను అందజేసిన సీఎం

రాష్టానికి వెంటనే నిధులు కేటాయించాలని విజ్ఞప్తి

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా

మిగతా 2 లో

# గ్రూప్-1 ర్యాంకుల నిలిపివేత



హైదరాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో గ్రూప్-1 పరీక్షా అభ్యర్థులకు ఊరటనిస్తూ, తెలంగాణ హైకోర్టు సంచలనాత్మక తీర్పును వెలువరించింది. గతంలో టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్స్ లిస్టును రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా, మెయిన్స్ పేపర్లను తిరిగి మూల్యాంకనం (రీవాల్యుయేషన్) చేయాలని ఆదేశించింది.

**8 నెలల్లో రీవాల్యుయేషన్ పూర్తి చేయాలి**

జస్టిస్ నామావరపు రాజేశ్వరరావు ధర్మాసనం ఈ కేసుపై సుదీర్ఘంగా విచారణ జరిపిన అనంతరం ఈ కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. రీవాల్యుయేషన్ ప్రక్రియను 8 నెలల్లో పూర్తి చేయాలని, ఆ తర్వాతే కొత్త ఫలితాలను విడుదల చేయాలని టీజీపీఎస్సీకి గడువు విధించింది. ఒకవేళ మూల్యాంకనం సాధ్యం కాకపోతే, తిరిగి పరీక్షలను నిర్వహించాలని కూడా ధర్మాసనం ఆదేశించింది.

**అవకతవకలపై అభ్యర్థుల ఆరోపణలు**

గత ఏప్రిల్‌లో టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలను ప్రకటించిన తర్వాత, మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని కొంతమంది అభ్యర్థులు ఆరోపించారు. దీనిపై అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా, పిటిషన్ల విచారణ అనంతరం కోర్టు ఈ చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ఈ తీర్పు వేలాది మంది అభ్యర్థులలో కొత్త ఆశలు రేకెత్తించింది. త్వరలో రీవాల్యుయేషన్ ప్రక్రియ ప్రారంభమై, పారదర్శకమైన ఫలితాలు వెలువడతాయని అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

## కేటీఆర్‌ను కలవాలంటే సీఎం రేవంత్‌రెడ్డిని అడగాలా



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఇటీవల భేటీ కావడంపై కూడా ఏపీ మంత్రి, టీడీపీ నేత నారా లోకేశ్ స్పందించారు. కేటీఆర్‌ను కలుస్తానని.. ఆయన్ను ఎందుకు కలవకూడదని ఆయన ప్రశ్నించారు. గతంలోనూ వివిధ సందర్భాల్లో కేటీఆర్‌ను కలిశానని గుర్తుచేశారు. కేటీఆర్‌ను కలవాలంటే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని అడగాలా అని ప్రశ్నించారు. తెలంగాణపై టీడీపీ ఫోకస్ చేస్తుందని ఏపీ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. జూబ్లీహిల్స్‌లో టీడీపీ పోటీపై పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుదే తుది నిర్ణయమని పేర్కొన్నారు. కవితను టీడీపీలోకి తీసుకోవడమంటే జగన్‌ను చేర్చుకున్నట్లేనని వ్యాఖ్యానించారు. ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థికి ఎందుకు ఓటు వేశారో జగన్‌ను వైసీపీ ఎంపీలు అడగాలని నారా లోకేశ్ సూచించారు. ఇప్పుడే కాదు.. 2029 ఎన్నికల్లోనూ మోదీకి మద్దతిస్తామని స్పష్టం చేశారు. రెడ్‌బుక్‌లో చాలా స్కామ్‌లు ఉన్నాయని నారా లోకేశ్ అన్నారు. అవన్నీ బయటకు వస్తాయని తెలిపారు. ఆ భయంతోనే జగన్ బెంగళూరులో ఉంటున్నారని విమర్శించారు. ఏపీ లిక్కర్ కేసులో ప్రభుత్వ జోక్యం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసు విచారణ పారదర్శకంగా కొనసాగుతోందని తెలిపారు. ఫైబర్ నెట్‌ను టాటా సంస్థకు ఇచ్చే చర్చ జరగలేదని స్పష్టం చేశారు.

## ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఓటమి

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించిన తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన చేతిలో ఓడిన ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి సంచలన లేఖ విడుదల చేశారు. ఆ లేఖలో ఉప రాష్ట్రపతి ఎన్నిక తీర్పును తాను సవినయంగా స్వీకరిస్తున్నానని తెలిపారు. ప్రజాస్వామ్య ప్రక్రియలపై ఉన్న గట్టి నమ్మకంతో ఓటమిని అంగీకరిస్తున్నానని పేర్కొన్నారు. ఈ ప్రయాణం తనకు గొప్ప గౌరవాన్ని, అనుభవాన్ని ఇచ్చిందని అన్నారు. న్యాయం, ప్రతీ వ్యక్తి యొక్క గౌరవం కోసం నిలబడే అవకాశం అందించిందని తెలిపారు. తనను కూటమి అభ్యర్థిగా నిలబెట్టిన ప్రతిపక్ష పార్టీల నేతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు అంటూ జస్టిస్ సుదర్శన్ రెడ్డి లేఖలో ప్రస్తావించారు.

## నిర్మలా సీతారామన్‌తో సీఎం రేవంత్ భేటీ



మొదటి పేజీ తరువాయి

ఇటీవల తెలంగాణలో భారీ వర్షాల కారణంగా జరిగిన పంట, ఆస్తి నష్టంపై అధికారులు ఇచ్చిన నివేదకను కేంద్ర మంత్రి నిర్మాలా సీతారామన్‌కు అందజేశారు. అనుకోని విపత్తుతో సర్వం కోల్పోయిన ప్రజలను ఆదుకునేందుకు యుద్ధ ప్రాతిపదికన రాష్ట్రానికి వెంటనే నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలో పేద, మధ్య తరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతోన్న ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటును సీఎం రేవంత్ రెడ్డి, నిర్మలా సీతారామన్‌కు వివరించారు. వాటి నిర్మాణానికి కేంద్రం నుంచి కూడా నిధులు మంజూరు చేయాలని కోరినట్లుగా సమాచారం. కాగా, అంతకు ముందు పార్లమెంట్‌లో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

## కూలిన హాస్టల్ భవనం

మొదటి పేజీ తరువాయి



వెంటనే స్పందించి చిన్నారులను జహీరాబాద్ ఆసుపత్రికి తరలించారు. అయితే, తరగతి గదుల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు భోజనానికి వెళ్లడంతో పెను ప్రమాదం తప్పినట్లు అయ్యింది. ఈ ప్రమాదానికి ముందు హాస్టల్‌లోని తరగతి గదిలో 84 మంది విద్యార్థులు ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. వారంతా ముందుగానే బయటకు వెళ్లడంతో పెద్దఎత్తున ప్రాణనష్టం తప్పిందని అంటున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఇతర ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేశారు. వెంటనే నూతన హాస్టల్ భవనం నిర్మించాలని ఉన్నతాధికారులను తల్లిదండ్రులు కోరారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యే ఏ లింగమో..?



మహబూబ్ నగర్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పార్టీ మారిన వారు తాము పార్టీ మారామని ధైర్యంగా చెప్పుకునే పరిస్థితి లేదని విమర్శించారు. పుంలింగం, స్త్రీ లింగం రెండు లింగాలు ఉంటాయి. కానీ సీఎం భాషలో చెప్పాలంటే పార్టీ మారిన ఎమ్మెల్యే తాము ఏ లింగమో చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వారికి ఓటు వేసి గెలిపించినందుకు మా కార్యకర్తలు బాధ పడుతున్నారన్నారన్నారు. మంగళవారం జడ్చర్లలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్ పార్టీ మారిన ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ కావడంపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించారు. పది మంది ఎమ్మెల్యేలు మా పార్టీలో చేరారని ఇటీవల పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఓ టీవీ ఇంటర్వ్యూలో స్పష్టంగా చెప్పారు. పీసీసీ చీఫ్ నేరాంగీకారం చేశాక ఈ విషయంలో ఇంకా చర్చ దేనికి? ఆ పది మంది ఎమ్మెల్యేలపై వేటు వేయడానికి స్పీకర్ కు మోహమాటం దేనికి అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలు, మీడియా, కోర్టులతో చిలిపి ఆటలాడి తప్పించుకోవాలనే ధోరణితో వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. జీవితమంతా రాజకీయాలు చేసిన పెద్దలు, మంత్రులుగా పని చేసిన వారు ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారని మీడియా అడిగితే చెప్పుకోలేని దురవస్థలో పడ్డారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ లో చేరానని కడియం శ్రీహరి కూడా చెప్పారు. అందువల్ల వీరిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో కోర్టు ఆదేశాలు ఉన్నందునా కోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తున్నామన్నారు.

**కేసీఆర్ కు పేరు వస్తుందనే దురాలోచన:**

కేసీఆర్ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90శాతం పూర్తి అయ్యాయని మిగతా 10 శాతం పనులకు కూడా భూసేకరణ చేశామని కేటీఆర్ చెప్పారు. ఆ 10 శాతం పనులను పూర్తి చేస్తే కేసీఆర్ కు పేరు వస్తుందని, కేసీఆర్ పేరును ప్రజలు మర్చిపోకుండా గుండెల్లో పెట్టుకుంటారనే దురాలోచనతో రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టును పడావు పెట్టారని కేటీఆర్ ఆరోపించారు.

## ఫార్ములా ఈ- రేసు కేసులో కీలక పరిణామం




హైదరాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): ఫార్ములా ఈ-రేసు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ మేరకు దాదాపు 9 నెలల పాటు కేసులో విచారణ జరిపిన ఏసీబీ అధికారులు పూర్తి నివేదికను మంగళవారం ప్రభుత్వానికి అందజేశారు. అదేవిధంగా కేసులో నిందితులుగా ఉన్న వారిపై చార్జిషిట్ దాఖలు చేసేందుకు గవర్నర్ అనుమతి కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు వద్దకు రిపోర్టు చేరింది. అక్కడి నుంచి అనుమతి రాగానే ఫార్ములా ఈ-రేసు కేసులో A1గా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్, A2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, A3గా హెచ్ఎండీఏ మాజీ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలతో పాటు A4, A5లపై ఏసీబీ అధికారులు చార్జ్‌షీటు దాఖలు చేయనున్నారు. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్‌ను మూడు సార్లు ఏసీబీ ప్రశ్నించిన విషయం తెలిసిందే. అయితే, ఫార్ములా ఈ-కారు రేస్‌లో భారీగా అవినీతి జరిగినట్లుగా ఏసీబీ తేల్చింది. కేసులో క్విడ్ ప్రోకోను అధికారులు స్పష్టమైన సాక్షాధారాలతో నిరూపించినట్లుగా సమాచారం అందుతోంది. ఫార్ములా ఈ-రేసు కోసం స్పాన్సర్‌షిప్ ఇచ్చిన సంస్థ నుంచి రేసు నిర్వహించిన సంస్థకు రూ.44 కోట్లు చెల్లింపులు జరిగినట్లుగా గుర్తించారు. అందుకు బదులుగా స్పాన్సర్‌షిప్ సంస్థ నుంచి రూ.44 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్‌ను బీఆర్ఎస్ తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

## తెలంగాణలో భిన్న వాతావరణ పరిస్థితులు




మొదటి పేజీ తరువాయి

ఎండాకాలాన్ని తలపిస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా సాయంకాలం సమయంలో క్యూమిలోనింబస్ మేఘాలు ఏర్పడి వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడని అనుకూల పరిస్థితులు, భూ ఉపరితం వేడెక్కుతుండటం, పచ్చదనం తగ్గిపోతుండటం, స్థానిక వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా అధికమవుతున్న వేడిమి పెరుగుతోంది. ప్రస్తుతం బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రానికి వర్ష సూచన చేసింది వాతావరణ శాఖ. మంగళవారం, బుధ, గురువారల్లో రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది వాతావరణ శాఖ.

**ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ :**

మంగళవారం పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. అదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న క్రమంలో ఎల్లో అలర్ట్ చేసింది వాతావరణ శాఖ. మిగతా అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నిజామాబాద్, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో నేడు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది వాతావరణ శాఖ. భారీ వర్షాలు కురిసే సమయంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్లొద్దని సూచించింది వాతావరణ శాఖ.

## గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టు సంచలన తీర్పు



హైదరాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల ఫలితాలపై హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. పరీక్షల మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని అభ్యర్థుల ఫిర్యాదులపై విచారణ జరిపిన హైకోర్టు, జనరల్ మెరిట్ లిస్ట్‌ను రద్దు చేస్తూ ఎనిమిది నెలల్లో రివాల్యూయేషన్ పూర్తి చేయాలని టీఎస్‌పీఎస్సీకి ఆదేశాలు జారీ చేసింది. ఆ గడువులో రీవాల్యూయేషన్ సాధ్యం కాకపోతే కొత్తగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి హరీష్ రావు ఈ తీర్పుపై స్పందిస్తూ, హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆయన విమర్శించారు. తొందరపాటు నిర్ణయాలు, లోపభూయిష్టమైన మూల్యాంకనం వల్ల విద్యార్థులు, నిరుద్యోగులు నష్టపోతున్నారని అన్నారు. పరీక్షలు నిర్వహించడం అంటే చిల్లర రాజకీయాలు కాదు, అది యువత జీవితాలతో ముడిపడిన విషయం అని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ యువతకు క్షమాపణ చెప్పాలి అని హరీష్ రావు డిమాండ్ చేశారు.

## కేటీఆర్‌కు బిగ్ రిలీఫ్

హైదరాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు బిగ్ రిలీఫ్ లభించింది. ఆయనపై నల్గొండ జిల్లాలోని వేర్వేరు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ ఏడాది టెన్త్ క్లాస్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగిన ఘటనపై ఎక్స్ పోస్టులను ఫార్వర్డ్ చేశారంటూ మున్సిపల్ ఛైర్ పర్సన్ రజిత మార్చి నెలలో ఫిర్యాదు చేశారు. నిందితులతో తమకు సంబంధం ఉన్నట్లుగా కేటీఆర్ ఎక్స్ లో పోస్ట్ చేసినట్లు ఆమె పోలీసులకు తెలిపారు. మాస్ కాపీయింగ్ పై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కేసులో ఏ1గా మన్నే క్రిశాంక్, ఏ2గా కేటీఆర్, ఏ3గా దిలీప్ కుమార్ లను చేర్చారు. ఇదే అంశంపై ఉగ్గడి శ్రీనివాస్, నరేందర్ అనే మరో ఇద్దరు వ్యక్తులు ఫిర్యాదు చేయగా రెండు ఎఫ్ఐఆర్ లు ఫైల్ చేశారు. తాజాగా ఈ కేసులపై విచారణ చేసిన రాష్ట్ర హైకోర్టు వాటిని కొట్టివేసింది.

## నంబాల కేశవరావు స్థానంలో కొత్త సెక్రటరీ



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సెక్రటరీ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు (70) ఛత్తీస్ గఢ్ ఎన్కౌంటర్ లో మరణించిన విషయం తెలిసిందే. ఆయన మరణించిన మూడున్నర నెలల తర్వాత కొత్త సెక్రటరీని నియమిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. కరీంనగర్ కు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవుజీని కొత్త సెక్రటరీగా నియమించినట్లు తెలిపింది. ఈ ఏడాది మే నెలలో ఛత్తీస్ గఢ్ లోని నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో నంబాల కేశవరావు కూడా ఉన్నారని, అతనిపై రూ.1.5 కోట్ల రివార్డు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే మృతుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా పోలీసులే దహన సంస్కరణలు నిర్వహించారు.

# పండ్లు, కూరగాయల సాగులో జిల్లా రైతులను ప్రోత్సహించాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



హనుమకొండ జిల్లా, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లాలో పండ్లు, కూరగాయల సాగులో జిల్లా రైతులను ప్రోత్సహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ శాఖల అధికారులు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలలతో జిల్లాలో పండ్లు, కూరగాయల సాగు, వాటి అమ్మకాలు, ఇతర ప్రాంతాల నుండి ఎంతెంత వస్తుంది, పట్టు పరిశ్రమ, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ

జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు అవుతుందని, చాలామంది రైతులు వరి సాగుకే మొగ్గు చూపిస్తున్నారని అన్నారు. ఫ్రూట్స్, వెజిటబుల్స్ కు ఎప్పుడు కూడా మంచి మార్కెట్ ఉంటుందని, ఇతర ప్రాంతాల నుండి దిగుమతి చేసుకోకుండా జిల్లాలోనే ఫ్రూట్స్, వెజిటబుల్స్ సాగు అయ్యే విధంగా అధికారులు రైతులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఫ్రూట్స్, వెజిటబుల్స్ ను మహిళా సమాఖ్యల ద్వారా ఒక బ్రాండింగ్ చేస్తూ లాభాలా బాటలో పయనించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొంత భూమిని లీజుకు తీసుకుని పట్టు సాగు చేయాలని సూచించారు. మహిళా సమాఖ్య ద్వారా కందులు కొనుగోలు చేసిన అనంతరం ప్రాసెస్ చేసిన తరువాత పప్పు అమ్మకాలు సాగించాలన్నారు. మహిళా సమాఖ్య, మహిళా ఎఫ్ పీ వోలకు మార్గనిర్దేశం చేస్తూ లాభాలు పొందే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. డిఆర్డిఎ ఆధ్వర్యంలో మహిళా సమాఖ్యల ద్వారా దాల్ మిల్ నిర్వహణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో ఫ్రూట్స్, వెజిటబుల్స్ సాగయ్యే విధంగా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలుపైనే కాకుండా ఫ్రూట్స్, వెజిటేబుల్స్ మార్కెటింగ్ చేయడం పై ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, మహిళా సమాఖ్యలు లాభాల బాటలో పయనించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్డివో మేన శ్రీను, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి అనసూయ, మార్కెటింగ్ శాఖ అధికారి అనురాధ, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, ఇతర అధికారులతో పాటు ఐనవోలు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఊరగుట్ట నేచర్ పార్క్‌ను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): ఊరగుట్ట నేచర్ పార్క్ ను పర్యాటక హబ్ గా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఇల్లందు మండలం సుభాష్ నగర్ లోని ఊర గుట్ట నేచర్ పార్క్ ను సందర్శించి, అక్కడ పర్యాటకులను ఆకర్షించడానికి, నేచర్ పార్క్ అభివృద్ధి కి అవకాశాలు, భవిష్యత్తులో చేపట్టవలసిన కార్యక్రమాలను సంభంధిత శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఊరగుట్ట నేచర్ పార్క్ జిల్లాలో సహజసిద్ధమైన అద్భుత సౌందర్యాన్ని కలిగిన ప్రదేశమని, దీనిని సక్రమంగా అభివృద్ధి పరచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే, రాష్ట్ర స్థాయిలో పర్యాటకులను ఆకర్షించే అవకాశముందని పేర్కొన్నారు. పార్క్ అభివృద్ధి ద్వారా పర్యాటక రంగంలో పురోగతితో పాటు స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయాన్నారు. ఊరగుట్ట నేచర్ పార్క్ లో ట్రెక్కింగ్ మార్గాలు, జిప్ లైన్, ప్లై ఏరియా, అడ్వెంచర్ స్పోర్ట్స్ వంటి వినోదాత్మక వసతులు ఏర్పాటు చేయడానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యువత, కుటుంబాలు, విద్యార్థులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఆకర్షితులయ్యేలా వినోదం, భద్రత, విశ్రాంతి అంశాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్క్ లో పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, చెత్త నిర్వహణ వంటి ప్రాథమిక వసతులు తప్పనిసరిగా కల్పించబడాలని తెలిపారు. పార్క్ లో ఏర్పాటయ్యే స్టాల్స్, ఫుడ్ కార్నర్స్, హ్యాండీక్రాఫ్ట్ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు వంటి వాటిని స్వయం సహాయక సంఘాలకు అప్పగించడం ద్వారా వారికి ఆర్థికాభివృద్ధి కలుగుతుందని, స్థానిక మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఊరగుట్ట నేచర్ పార్క్ ను జిల్లాలో పర్యాటక హబ్ గా తీర్చిదిద్దడం లక్ష్యమని, దీనిద్వారా జిల్లా పర్యాటక రంగం అభివృద్ధికి కొత్త దారులు తెరవబడతాయని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ రవి, ఎఫ్ డి ఓ కరుణాకర చారి, పంచాయతీ రాజ్ ఈ ఈ శ్రీనివాస్, జిల్లా క్రీడా శాఖ అధికారి పరందామ రెడ్డి, ఏం పి డి ఓ ధన్సిగ్ మరియు సంభంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా యూరియా పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

**అధిక ధరలకు విక్రయించిన ఎరువుల దుకాణం సీజ్**

**రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

**వ్యవసాయ శాఖ ఏడిఏ అజ్మీర శ్రీనివాసరావు**

**మండల ప్రత్యేక అధికారి వేముల సురేష్**



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): మంగళవారం కొత్తగూడ మండల రైతువేదికలో వారు విలేకరులతో మాట్లాడారు, జిల్లా వ్యాప్తంగా యూరియా పంపిణీకి పగడ్బందీ ఏర్పాట్లు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మకాలను కొనసాగించడం కోసం జిల్లా యంత్రాంగం యావత్తు యుద్ధ ప్రాతిపదికన విధులు నిర్వహించడం జరుగుతుందని, కొత్తగూడ మండలంలో ఇప్పటివరకు (1750) మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామని, రేపు (50) మెట్రిక్ టన్నులు, ఎల్లుండి (40) మెట్రిక్ టన్నులు రావడం జరుగుతుంది అని రానున్న రోజుల్లో వచ్చే యూరియాను రైతులకు వేగంగా పారదర్శకంగా సరఫరా చేయుటకు పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. రైతుల సౌకర్యార్థం కొత్తగూడ మండల కేంద్రంలో సబ్ సెంటర్ ను కూడా ఓపెన్ చేయడం జరిగిందన్నారు. రేపు ఉదయం కొత్తగూడ మండల కేంద్రంలో రెండు క్లస్టర్లు బత్తులపల్లి, కొత్తగూడ, పోగులపల్లి, సాదిరెడ్డిపల్లి, ఏదులపల్లి క్లస్టర్ రైతు వేదిక లలో యూరియా పంపిణీ చేయడం కోసం ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు, అందుకు సంబంధించి రైతులకు ముందస్తు సమాచారం కూడా ఇవ్వడం జరిగింది అన్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా ఎరువుల దుకాణం నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అందులో భాగంగానే ఈరోజు బయ్యారం మండల కేంద్రం లో సన ఎరువుల దుకాణం ను లైసెన్స్ క్యాన్సిల్ చేసి సీజ్ చేయడం జరిగిందన్నారు,

రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అనవసర వదంతులు నమ్మవద్దని ఆయన అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 25, వేల 406, మెట్రిక్ టన్నులు యూరియా పంపిణీ చేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వేముల సురేష్, స్థానిక తహసిల్దార్ కె.రాజు ఎంపీడీవో ఏ. రోజా రాణి, ఏవో ఉదయ్, ఎస్ఐ రాజ్ కుమార్, ఏఈఓ రాజ్, ఆర్ఐ, ఎన్.పరమేష్, తదితరులు ఉన్నారు.

# డిమాండ్ ఉన్న పంటలు సాగు- ఎకరానికి లక్షన్నర ఆదాయం



మహబూబాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): మంగళవారం జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న మహబూబాబాద్, నెల్లికుదురు మండలాల్లో పంటలను పరిశీలించి జిల్లా లో రైతు లు మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేస్తూ ఎకరానికి లక్ష రూపాయల ఆదాయం పొందుతున్నారన్నారు. జిల్లా లో అన్ని మండలాల్లో ఆయిల్ పామ్ సాగు, పండ్ల తోటలు, కూరగాయలు, మల్బరీ, పూలు, మునగ మొదలైన మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేస్తున్నారు. రైతులకు పలు సూచనలు చేసి, ఆయిల్ పామ్, కూరగాయలు, పండ్లు, పూలు, మునగ , మల్బరీ వంటి పంటలు సాగు చేయాలని, ప్రభుత్వ ప్రోత్సాహక రాయితీలు పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్షేత్ర సందర్శన లో రైతు లు జి. రమేష్, డి. బాలు, జి. నరేష్, యాకన్న , భిక్షం, పద్మ మరియు ఫీల్డ్ అధికారులు జి. కిషోర్, జి.నర్మద, ఏ. రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





వరంగల్ జిల్లా, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): వరంగల్ ఆటోనగర్ లోని గిర్మాజీపేట ప్రభుత్వ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అక్షయ పాత్ర వారిచే వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు రుచి గురించి అడిగి తెలుసుకుని, నిర్వాహకులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ముందుగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో అక్షరాలు, పదాలు చదివించారు. ఆపై హైస్కూల్ తరగతులను సందర్శించి, పదవ తరగతి విద్యార్థుల తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల పఠన సామర్థ్యాన్ని పదిశీలించి, పాఠాలు బోధించి, పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి, వారి విషయావగహన పరీక్షించారు. మెరుగైన బోధన అందించుటకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల విద్య ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో మీరేం అవుతారని, మీ ఆశయం ఏమిటని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించే మంచి మాటలు చెబుతూనే జీవిత లక్ష్యం ఏమిటని కుశల ప్రశ్నలను సంధించి విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇష్టపడి చదవాలని, మానసిక ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. బోర్డు పరీక్షలకు ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో చదివి విజయం సాధించాలని ఆకాంక్షించారు. మెరుగైన విద్య బోధించాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డిఆర్ ఓ విజయలక్ష్మి, తహసీల్దార్ ఇక్బాల్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు భోపాల్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# ఇంటర్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు రావాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): విద్యార్థుల జీవితంలో ఇంటర్మీడియట్ దశ చాలా కీలకమైనదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. వచ్చే ఇంటర్మీడియట్ పరీక్ష లో ఉత్తమ ఫలితాల సాధన కై తీసుకోవాల్సిన కార్యాచరణ పైన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ లతో మంగళవారం కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ విద్య లోనే విద్యార్థులు తమ భవిష్యత్ ఉన్నత విద్యకు, ఉద్యోగాలకు అవసరమైన ఐచ్ఛిక విషయాలను ఎంచుకుంటారని..తల్లిదండ్రులు కూడా ఈ స్థాయి లో విద్యార్థుల పైన ఎక్కువ దృష్టి పెడతారన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంబంధించిన వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు అలాగే ఫేస్ రికగ్నైజ్ సిస్టం ద్వారా హాజరు శాతం 100 శాతం పూర్తి కావాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా మొదటి, రెండవ సంవత్సరాల వారిగా టీచర్ల కమిటీలుగా ఏర్పడి వచ్చే పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించుటకై తీసుకోవలసిన కార్యాచరణను రూపొందించాలన్నారు. గత పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా 3వ స్థానం లో నిలిచినందున.. ఈసారి ప్రయివేట్ స్కూల్ ల నుండి ప్రభుత్వ పాఠశాల ల్లో అడ్మిషన్ లు పెరిగాయాన్నారు. ఇదే విధంగా ఇంటర్ విద్య లో కూడా ఉత్తమ ఫలితాలు రావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మిదియేట్ అధికారి జితేందర్,కేజీవీబీ, మాడల్, అన్ని సంక్షేమ కళాశాల ప్రిన్సిపాల్ లు పాల్గొన్నారు.

# యూరియా కోసం రోడ్డెక్కిన పట్టింపు లేని ప్రభుత్వమిది

### బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు


### వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే



ములుగు, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): ఎన్నికల్లో అమలు కానీ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికలయ్యాక హామీలను తుంగలో తొక్కి రైతులను, కార్మికులను, ఉద్యోగులు అన్నీ వర్గాల ప్రజలను మోసం చేసారని విమర్శించారు. పదేళ్ళ కాలంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రైతులకు కన్నీళ్లు రాకుండా కాపాడుకున్నారని, అన్నీ వర్గాల ప్రజలు మెచ్చే విధంగా పరిపాలన చేసి కష్టాలను రూపుమాపారని గుర్తు చేశారు. పదేళ్ళ కాలంలో ఎన్నడూ యూరియా సమస్య రానీయకుండా పాలన చేస్తే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను రోడ్డుమీదకు తీసుకువచ్చి యూరియా కోసం గంటల తరబడి లైన్లో వేచి ఉండేలా చేశారని, బీజేపీ, కాంగ్రెస్ కు చెరో ఎనిమిది మంది ఎంపీలను గెలిపిస్తే వారు ఏ ఒక్క రోజు రైతుల కష్టాలు, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేంద్రం చేసే పనులకు అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని ధ్వజమెత్తారు.

# కొత్తపల్లి గోరి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులకు మోక్షం





తీన్మార్ న్యూస్ ఎఫెక్ట్

### బాధ్యతాయుత జర్నలిజం ఎఫెక్ట్

### శీర్షిక ఎఫెక్ట్ తో అధికారుల తక్షణ స్పందన

### యుద్ధ ప్రాతిపదికన పనుల ప్రారంభం..

కొత్తపల్లి గోరి, సెప్టెంబర్ 9 (తీన్మార్ న్యూస్): గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, పారిశుద్ధ్య పనులు అస్తవ్యస్తం" అనే శీర్షికతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలంలోని గ్రామాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులపై తీన్మార్ న్యూస్ దినపత్రిక ప్రచురించిన కథనం పెను ప్రకంపనలు సృష్టించింది. కేవలం వాస్తవాలను, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్భయంగా, నిక్కచ్చిగా వెలుగులోకి తీసుకొచ్చిన తీన్మార్ న్యూస్ దినపత్రిక కృషికి అధికారులు తక్షణమే స్పందించారు. ఈ పత్రికలోని "శీర్షిక ఎఫెక్ట్"తో కొత్తపల్లి గోరి మండలంలో గత కొన్ని రోజులుగా నిర్లక్ష్యానికి గురైన పారిశుద్ధ్య పనులు, పల్లె ప్రకృతి వనాల నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టి సారించి తక్షణమే చర్యలు చేపట్టారు.

తీన్మార్ న్యూస్ దినపత్రికలో ప్రచురితమైన కథనం వెలువడగానే, జిల్లా ఉన్నతాధికారులు స్థానిక పంచాయతీ అధికారులను, కార్యదర్శులను అప్రమత్తం చేశారు. నివేదికలో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి వెంటనే కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల నేపథ్యంలో, గ్రామాల్లో నిలిచిపోయిన చెత్త సేకరణ పనులు, కాలువల శుభ్రత, రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించడం వంటి కార్యక్రమాలు యుద్ధప్రాతిపదికన ప్రారంభమయ్యాయి. పల్లె ప్రకృతి వనాలు గత కొన్ని నెలలుగా నిర్వహణ లేక అధ్వానంగా మారిన విషయంపై తీన్మార్ న్యూస్ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా అధికారులు పనులు చేపట్టారు.

తీన్మార్ న్యూస్ దినపత్రిక కృషిని గ్రామస్తులు ప్రశంసిస్తున్నారు. "తీన్మార్ న్యూస్ కథనం లేకపోతే మా గ్రామాల్లో పారిశుద్ధ్యం ఇంత త్వరగా మెరుగుపడేది కాదు" అని ఒక గ్రామస్తుడు వ్యాఖ్యానించారు. "పత్రికలు కేవలం వార్తలను ప్రచురించడమే కాకుండా, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తీన్మార్ న్యూస్ నిరూపించింది" అని మరొక గ్రామ పెద్ద పేర్కొన్నారు. మొత్తంగా, తీన్మార్ న్యూస్ దినపత్రిక ప్రచురించిన కథనం కేవలం ఒక వార్తగా మిగిలిపోకుండా, సమస్యకు పరిష్కారాన్ని చూపించి, ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకొచ్చింది. ఈ సంఘటన, బాధ్యతాయుతమైన జర్నలిజం సమాజానికి ఎంత ముఖ్యమో మరోసారి చాటి చెప్పింది.

## గ్రామాల్లో పర్యవేక్షించని మండల అధికారి








### వార్త కథనాలకు సైతం స్పందన కరువు

### అధికారుల తీరుపై మండిపడుతున్న స్థానికులు

కొత్తపల్లి గోరి, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలంలోని గ్రామాల పరిస్థితి అద్వానంగా మారింది. నూతనంగా ఏర్పడిన మండలం పేరుకే మండల అధికారిగా ఉన్నారంటే ఉన్నారు అనే విధంగా మండలంలో చర్చనీఅంశంగా మారింది. మండల అధికారి పర్యవేక్షణ కరువైందని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని పల్లె ప్రకృతి వనాలు పారిశుద్ధ్య పనులపై నీలి నీడలా మండల అధికారి వ్యవహరిస్తున్నారని చర్చనీయంగా మారింది. పల్లె ప్రకృతి వానాలపై "తీన్మార్ న్యూస్ దినపత్రిక"లో ఇప్పటికే ప్రచురించడం జరిగింది. ఐనప్పటికీ చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు మండల అధికారి వ్యవహరిస్తున్నాడని ప్రజలు వాపోతున్నారు. కావున జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.

తీన్మార్ www.teenmaarepaper.com
09 Sep 2025 - Page 3

# గ్రామ గ్రామానికి సిసి రోడ్ల మంజూరు

### అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం

### ప్రతి మహిళ మహిళా సంఘాలలో చేరాలి

### రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క)



ములుగు జిల్లా, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): మారుమూల, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో అన్ని గ్రామాలలో నూతనంగా సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తున్నామని, రానున్న రోజులలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళ వారం వెంకటాపూర్ మండలంలో సింగారకుంటపల్లె కొత్త గ్రామ పంచాయతీ భవనం అంచనా 20 లక్షలు, నర్సాపూర్‌లో అంతర్గత సిసి రోడ్లు (08 వర్క్స్) అంచన 40 లక్షలు, నారాయణగిరి పల్లి అంగన్‌వాడి భవనం అంచనా 12 లక్షల నిర్మాణ పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ గ్రంథాలయ చైర్మన్ బానోతు రవి చందర్ లతో కలసి శంకుస్థాపన, నారాయణగిరి పల్లిలో అంచన 45 లక్షల టి నిర్మించిన అంతర్గత సిసి రోడ్లు, డ్రైనేజీ (09 వర్క్స్) పనులను ప్రారంభించారు. ఈ సందర్భంలలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అంతర్గత రోడ్లను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రధాన రహదారులను విస్తరణ పరచడం జరుగుతున్నదని అన్నారు. ఇండ్లు లేని నిరుపేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని, ఇండ్లు మంజూరు కానీ నిరుపేదలు ఎవరు ఆందోళన కింద వద్దని తెలిపారు. ప్రతి మహిళ మహిళా సంఘాల గ్రూపులో చేరి వడ్డీ లేని రుణాలను పొందడమే కాకుండా బ్యాంకుల ద్వారా రుణాలు పొంది పలు వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదగవచ్చుని అన్నారు. ఎక్కడ అభివృద్ధి చెందని ప్రాంతాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని, ప్రతి గ్రామానికి రోడ్లు వేయడం, రోడ్లు విస్తరణ పనులు చేపట్టడం ముఖ్యమంత్రి ఆదేశాలతో జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ అజయ్, డి ఆర్ డి ఓ శ్రీనివాస రావు, జిల్లా పంచాయతీ అధికారి దేవ్ రాజ్, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యవసర సరుకుల పంపిణీ చేసిన మంత్రి సీతక్క



గోవిందరావు పేట, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన 495 కుటుంబాలకు యునైటెడ్ వే, ఇన్ఫోసెస్ సంస్థల ఆధ్వర్యంలో నిత్యవసర సరుకుల పంపిణీలో భాగంగా గోవిందరావుపేట మండలంలోని ప్రాజెక్టు నగర్ లో పలు గ్రామాలలోని 149 కుటుంబాలకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థ యునైటెడ్ వే ఆధ్వర్యంలో ప్రతి కుటుంబానికి బియ్యం, పప్పులు, నూనె, గోధుమ పిండి, సబ్బులు తదితర నిత్యావసర సరుకులను అంద చేయడం జరుగుతుందని తెలిపారు. బాధిత కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తక్షణ సహాయాన్ని అందించడం మూసుకొచ్చారని అన్నారు. ప్రతి సంవత్సరం భారీ వర్షాల వలన పలు గ్రామాల్లో ప్రజలు నష్టపోతుంటారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వంతో పాటు

సేవా సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని, ఏ ఒక్క కుటుంబం ఆహారం లేక ఇబ్బందులు పడకుండా నిత్యవసర సరుకులను అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు కూడా అవసరమైన సహాయం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ వే, ఇన్ఫోసెస్ సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులకు అత్యధిక ప్రాధాన్యత

### గ్రామీణ ప్రాంతాలకు, జిల్లా కేంద్రంలో రోడ్డు నిర్మాణ పనులు

### రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)



ములుగు జిల్లా, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): గ్రామీణ ప్రాంతాలతో పాటు జిల్లా మండల కేంద్రాలలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్ణయం తీసుకున్నదని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి 163 నుండి మదనపల్లి క్రాస్ రోడ్డు వరకు నాలుగు కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న రోడ్డు వెడల్పు, డివైడర్, సెంటర్ లైటింగ్ పనులను జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు

రవి చందర్ లతో కలిసి మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయడమే కాకుండా ఇప్పటికీ రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని వివరించారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నుండి పలు గ్రామాలకు వెళ్లే రహదారులను విస్తరించి పనులను పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. బతుకమ్మ పండుగ వరకు రోడ్డు పనులను, నాణ్యత లోపించకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 4వ బెటాలియన్లో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



మామునూరు, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా మామునూరు నాలుగో బెటాలియన్ ఆవరణలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 111వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ శ్రీ డి.శివప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. నిజాం నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా అతను తన కలం ఎత్తాడు. అతను స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు. అతని జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించింది. కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో రచయితగా ప్రఖ్యాతి గావించాడు. రాజకీయ వ్యంగ్య కవిత్వం రాయడంలో కాళోజీ దిట్ట అని తెలియజేయడం జరిగింది.కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ శ్రీనివాస రావు, వీరన్న, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రాజు, రవి, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణ మరియు బెటాలియన్ అధికారులు, సిబ్బంది, మినిస్ట్రియల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు ప్రణాళికను రూపొందించాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో గోదావరి పుష్కరాలు నిర్వహణకు శాఖల వారిగా చేయాల్సిన ఏర్పాట్లుపై రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, అగ్నిమాపక, వైద్య, ఆర్టీసీ, విద్యుత్తు, ఉద్యాన, ఆర్ అండ్ బి, మహిళా సంక్షేమ, జాతీయ రహదారులు, మత్స్య, దేవాదాయ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2027 సంవత్సరంలో జరుగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా లక్షలాది భక్తులు రానున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో ముందుగానే భక్తులకు చేపట్టాల్సిన సౌకర్యాలపై సమగ్ర కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్, శానిటేషన్, వైద్య, రవాణా, భద్రత తదితర సౌకర్యాలను సమగ్రంగా కల్పించాల్సిన అవసరం ఉన్నందున రానున్న 3 రోజుల్లో చేపట్టాల్సిన పనులపై అంచనా నివేదికలు అందచేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా ఘాట్ల వద్ద శుభ్రత, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, తాత్కాలిక వసతి గృహాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసే దిశగా తక్షణం శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

## అపరిచిత వ్యక్తులు పంపించిన లింకులను ఓపెన్ చేయవద్దు : కుమారస్వామి ఏఎస్ఐ





శాయంపేట, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్బిఐ సహకారంతో వాలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక అవగాహన, మరియు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మారపల్లి క్రాంతికుమార్ విడ్స్ కౌన్సిలర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాయంపేట ఏఎస్ఐ కుమారస్వామి హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆర్థిక క్రమశిక్షణ ఎంత అవసరమో అదేవిధంగా సైబర్ నేరాల పట్ల ముందు జాగ్రత్త మరియు అవగాహన అంతే ముఖ్యమని అన్నారు, ప్రస్తుత సమాజంలో రోజురోజుకు ప్రతి పోలీస్ స్టేషన్లో సైబర్ నేరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, దీనికి కారణం అవగాహన లోపమే అని అన్నారు, మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా సైబర్ నెరగాళ్లు మీరు బహుమతులు గెలుచుకున్నారు అని, లోన్ యాప్స్ క్లిక్ చేయమని మాయమాటలు చెప్పి అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు, కాబట్టి అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినప్పుడు మన బ్యాంకు వివరాలు వారికి తెలపకుండా ఓటీపీలు చెప్పకుండా, తెలియని లింకులు ఓపెన్ చేయకుండా జాగ్రత్త వహించాలని తెలియజేశారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరు మత్తు పానీయాలకు దూరంగా ఉండి నిషేధిత ప్యాకెట్లను నిర్మూలించే విధంగా ప్రతి ఒక్కరూ పాటుపడి సమాజంలో మార్పు తీసుకురావాలని కోరారు. అదేవిధంగా ఎస్బిఐ బ్యాంకు ద్వారా ఆరోగ్య భీమా మరియు ప్రమాద భీమా లను తీసుకొని మనకు మన కుటుంబాలకు రక్షణగా ఉండాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో విడ్స్ కౌన్సిలర్ మారేపల్లి విజయకుమార్, ప్రజ్వల్ సంస్థ ఎండి గౌస్, భానుమతి, కల్పన, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఈసారి పది రోజుల పాటు బతుకమ్మ

మొదటి పేజీ తరువాయి

బంధం పెనవేసుకుని ఉంటుంది. చిన్నా పెద్దా, పేద, ధనిక తేడా లేకుండా ప్రతిఒక్క ఆడబిడ్డ పూలతో అందంగా బతుకమ్మ పేర్చి, అంతే అందంగా తానూ ముస్తాబవుతుంది. అలాంటి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ఈసారి పది రోజుల పాటు జరగనుంది. సాధారణంగా తొమ్మిది రోజుల పాటు జరుపుకునే ఈ వేడుకలు, ఈ ఏడాది తిథి ద్వయం కారణంగా అదనంగా ఒక రోజు కొనసాగనున్నాయి. ఈ నెల 21వ తేదీన ప్రారంభమై 30వ తేదీ వరకు ఈ సంబరాలు జరగనున్నాయి. అయితే బతుకమ్మ వేడుకలు ప్రాంతాన్ని బట్టి మారుతూ ఉంటాయి. కొన్ని ప్రాంతాల్లో తొమ్మిది రోజులు, మరికొన్ని ప్రాంతాల్లో పది రోజులు వేడుకలు నిర్వహించుకుంటారు.



### ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా

ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకల ద్వారా పర్యాటక రంగానికి ప్రచారం కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తుంది. సెప్టెంబర్ 21 నుంచి 30 వరకు పదిరోజుల పాటు పూల పండగ నిర్వహించనుంది. ఈ వేడుకలను కాకతీయుల కాలంలో బతుకమ్మ వైభవంగా జరిగేదని చరిత్రకారులు చెబుతుంటారు. అలాంటి కాకతీయుల కళావైభవాలకు ప్రతీకగా నిలిచే రోజు హన్మకొండలోని వేయి స్తంభాల గుడిలో మొదటి రోజు బతుకమ్మ వేడుకలు ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

### తొమ్మిది రోజుల పండుగ

తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ మాతృత్వంలోని నవమాసాలకు ప్రతీకగా భావిస్తారు. ఈ కారణంగానే ఈ పండుగను సంతాన సాఫల్యతకు సంబంధించిన వేడుక అనికూడా అంటారు. బతుకమ్మ పండుగ అంటే తొమ్మిది రోజులు, తొమ్మిది రకాల పూలతో, తొమ్మిది రూపాల్లో అమ్మవారిని అలంకరించడం ఆనవాయితీ. కానీ, ఈ ఏడాది పండితులు, సిద్ధాంతులు చెబుతున్న దాని ప్రకారం ఈ వేడుకలు మొత్తం పది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై, చివరి రోజు సద్దుల బతుకమ్మతో పండుగ ముగుస్తుంది. తొమ్మిది రోజుల పాటు తెలంగాణ ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సాయంత్రం వేళల్లో వాటి చుట్టూ తిరుగుతూ, బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేస్తారు. ఈ ఏడాది అదనంగా వచ్చిన పదవ రోజు కూడా సంబరాలు కొనసాగడం పట్ల బతుకమ్మ తెలంగాణ ఆడపడుచులకు మరొక రోజు బతుకమ్మ సంబరం జరుపుకునే అవకాశం లభించినట్లైంది. తిథి ద్వయం చాలా అరుదు: నందకిషోరాచార్య, పురోహితులు, సిద్ధాంతి ఈ ఏడాది తిథి ద్వయం కారణంగా దసరా మహోత్సవాలు 11 రోజులు జరగనున్నాయి. ఈ అశ్వియుజ శుద్ధ చవితి ఈ నెల 26, 27 తేదీల్లో రావడం కారణంగా పది రోజుల మహోత్సవాలు 11 రోజులకు పొడిగించబడ్డాయి. ఇలా రెండు తిథులు ఒకేసారి రావడం చాలా అరుదుగా జరుగుతుంది. కొన్ని సంవత్సరాల తర్వాత తిథి ద్వయం పునారావృతం అయింది. అమావాస్య రోజున బతుకమ్మ పండుగ ప్రారంభమవుతుంది. బతుకమ్మ పండుగ దసరాకి ముందు రోజు, లేదా రెండు రోజుల ముందుగా జరుగుతుంది. ఈ ఏడాది దేవీ ఉత్సవాలు సెప్టెంబర్ 22న అశ్వయుజ శుద్ధ పాడ్యమి రోజున ప్రారంభమై, అక్టోబర్ 2న అశ్వియుజ శుద్ధ దశమి అయిన విజయదశమితో ముగుస్తున్నాయి.

# జైళ్ల శాఖకు ప్రశంసలు తెలిపిన గవర్నర్

## మొదటిసారిగా ఏఐ -ఆధారిత నిఘా వ్యవస్థల ప్రదర్శన

## 21 రాష్ట్రాల నుంచి 1222 మంది ప్రతినిధుల హాజరు





హైదరాబాద్, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): జైలు సిబ్బంది ప్రజల దృష్టికి దూరంగా పనిచేస్తున్నప్పటికీ, అంతర్గత భద్రతను కాపాడటంలో, సంస్కరణలను సాధ్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. జైళ్లశాఖ తరపున టెక్నాలజీ ఎగ్జిబిషన్ను ప్రవేశపెట్టడం ద్వారా కొత్త బెంచ్మార్క్ను ఏర్పాటు చేసినందుకు, డ్యూటీ మీట్ను అధికారికంగా ప్రారంభించినందుకు తెలంగాణ జైళ్ల శాఖను ఆయన అభినందించారు. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా ఆధ్వర్యంలో 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటి మీట్ - 2025ను ఆర్బీవీఆర్ఆర్ పోలీస్ అకాడమిలో మంగళవారం అట్టహసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. సీఎస్ రామకృష్ణ రావు, అడిషనల్ డైరక్టర్ బీపీఆర్డీ రవి జోసెఫ్, హెూం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా డీజీపీ జితేందర్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ జైళ్ల శాఖ డ్యూటీ మీట్ల చరిత్రలో తొలిసారిగా ఏఐ-ఆధారిత నిఘా వ్యవస్థలు, డ్రోన్లు, స్కానర్లు, నిషిద్ధ వస్తువులను గుర్తించే సాంకేతికతలు, రోబోటిక్స్ అధునాతన సమాచార నిర్వహణ సాఫ్ట్వేర్ ప్రవేశ పెట్టడం పట్ల జైళ్ల శాఖ పనితీరు మెరుగుపడుతుందని తెలిపారు. ఖైదీల సృజనాత్మకత, క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే వివిధ రాష్ట్రాల నుంచి జైలులో తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనలో ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. డ్యూటీ మిట్లో 21 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 1,222మంది జైళ్ల శాఖ ఔత్సహికులు, 144 సపోర్టింగ్ స్టాఫ్ పాల్గొంటున్నారని జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, ఆర్బీవీఆర్ఆర్ పోలీస్ అకాడమి డైరక్టర్ అభిలాష బిష్త్, ఇంటిలిజెన్స్ డీజీ శివధర్ రెడ్డి హాజరయ్యారు.

# భారత్‌కు వ్యతిరేకంగా సెనేటర్ వ్యాఖ్యలు

## క్షమాపణలు చెప్పాలని ప్రధాని సూచన





**సిడ్నీ, సెప్టెంబర్ 9:** భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన సెనెటర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ సూచించారు. ఆస్ట్రేలియాలో కొంతకాలంగా వలసదారులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున జరుగుతున్న నిరసనల నేపథ్యంలో ఆమె చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆస్ట్రేలియాలో పెరుగుతోన్న జీవనవ్యయాలకు భారత వలసదారులను నిందిస్తూ సెంటర్ రైట్ లిబరల్ పార్టీకి చెందిన సెనెటర్ జసింటా ప్రిన్స్ విమర్శలు చేశారు. తమకు ఓట్లు పడేలా భారతీయ వలసదారులను రప్పిస్తున్నారని ఈ సందర్భంగా ఆల్బనీస్‌కు చెందిన ఆస్ట్రేలియన్ లేబర్ పార్టీ పైనా ఆమె వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియాకు వలస వచ్చిన భారతీయుల సంఖ్య భారీగా ఉంది. ఆ సంఖ్యను లేబర్ పార్టీకి వచ్చిన ఓటింగ్‌లో మనం చూడొచ్చని ప్రైస్ అన్నారు. ఈ వ్యాఖ్యలు ఆస్ట్రేలియన్-ఇండియన్ కమ్యూనిటీలో తీవ్ర ఆగ్రహానికి దారితీశాయి. వెంటనే ఆమె క్షమాపణలు చెప్పాలని వారంతా డిమాండ్ చేశారు. సొంత పార్టీ కూడా ఆమె వైఖరిని ఖండించింది. ప్రైస్ విమర్శలపై ఆల్బనీస్ స్పందించారు. భారత కమ్యూనిటీకి చెందిన ప్రజలను ఆ వ్యాఖ్యలు బాధించాయి. ఆమె వెంటనే క్షమాపణలు చెప్పాలి. ఆమె సొంత పార్టీ నేతలు కూడా అదే చెప్తున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారిక లెక్కల ప్రకారం.. 2023 నాటికి భారత సంతతికి చెందిన 8,45,800 మంది ఆస్ట్రేలియాలో నివసిస్తున్నారు. గత దశాబ్దకాలంతో పోలిస్తే అది రెట్టింపు సంఖ్య. ఈ నిరసనల నేపథ్యంలో కమ్యూనిటీ గ్రూపులతో న్యూసౌత్ వేల్స్ ప్రభుత్వం సమావేశం నిర్వహించింది. భారత వలసదారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చింది. ఇక ఈ పరిణామాలను భారత విదేశాంగ శాఖ సునిశితంగా పరిశీలిస్తోంది. ఎప్పటికప్పుడు ఆస్ట్రేలియా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది.

# పాట్నా-ఢిల్లీ మధ్య వందేభారత్ స్లీపర్ ట్రైన్

## బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్లాన్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:** వందేభారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైలును భారతీయ రైల్వేశాఖ ప్రారంభించ నున్నది. ఢిల్లీ నుంచి పాట్నా మధ్య తొలి వందేభారత్ స్లీపర్ రైలును ప్రారంభించేందుకు ఆ శాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ఈ రైలు ప్రయాగ్‌రాజ్ మీదుగా వెళ్తుంది. అయితే బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వందేభారత్ స్లీపర్ రైలును ప్రవేశపెట్టేందుకు రైల్వేశాఖ భావిస్తున్నట్లు-తెలుస్తోంది. నవంబర్ 22వ తేదీన ప్రస్తుత అసెంబ్లీ గడువు ముగుస్తుంది. అయితే ఆ తేదీలోగానే ఎన్నికల కమిషన్ ఎన్నికల పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. నవంబర్ 15లోగా ఎన్నికలు జరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు కేవలం డే జర్నీ వందేభారత్ రైళ్లను మాత్రం నడుస్తున్నాయి. అయితే వందేభారత్ స్లీపర్ రైళ్ల వల్ల రాత్రి జర్నీ కూడా సుఖంగా సాగనున్నది. దీపావళి సీజన్ సందర్భంగా ఆ రైళ్లను ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఢిల్లీ, పాట్నా మధ్య ప్రయాగ్‌రాజ్ మార్గంలో వెళ్లే వందేభారత్ రైలు కేవలం 11.5 గంటల్లో తన జర్నీ పూర్తి చేస్తుంది. అయితే ఇదే మార్గంలో వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు 23 గంటల సమయం పడుతోంది. బీఎంఈఎల్ కంపెనీ వందేభారత్ స్లీపర్ రైలును ఉత్పత్తి చేస్తున్నంది. ప్రస్తుతం రాజధాని ఎక్స్‌ప్రెస్, తేజస్ ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న ట్రావల్ ఆప్షన్ల కంటే ఆధునిక రీతిలో వందేభారత్ స్లీపర్ రైలును ప్రవేశపెడుతున్నారు. ఆ రైలు గంటకు సుమారు 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. వందేభారత్ స్లీపర్ రైళ్లలో కేవలం 16 కోచ్‌లు ఉంటాయి. వీటిల్లో 11 ఏసీ-3 -టైర్ కోచ్‌లు, రెండు ఏసీ 2 -టైర్, ఓ ఏసీ ఫస్ట్‌క్లాస్ కోచ్ ఉంటుంది. సెన్సార్ ఆధారిత ఇంటర్ కమ్యూనికేషన్ డోర్లు ఉన్నాయి.

తీన్మార్



# ఈ పండ్లను మీరెప్పుడైనా తిన్నారా..?

## వీటి లాభాలు తెలిస్తే వెంటనే తినడం ప్రారంభిస్తారు..!



ఆరోగ్యంగా ఉండడం కోసం రోజువారి ఆహారంలో పండ్లను తినాలని వైద్యులు, పోషకాహార నిపుణులు సూచిస్తుంటారు. అందులో భాగంగానే చాలా మంది తమకు అందుబాటులో ఉన్న పండ్లను తింటుంటారు. అయితే కొన్ని రకాల పండ్లు మనకు ఏడాది పొడవునా అందుబాటులోనే ఉన్నా ఆ పండ్లను చాలా మంది సరిగ్గా పట్టించుకోరు. అలాంటి పండ్లలో పీచ్ పండ్లు కూడా ఒకటి. ఎరుపు, నారింజ రంగు మిక్స్ చేసిన కలర్‌లో ఉండే ఈ పండ్లు మనకు పండ్లు దుకాణాలు, సూపర్ మార్కెట్లలో లభిస్తాయి. ఈ పండ్లు మనకు ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. వీటిని చాలా మంది చూసే ఉంటారు. కానీ వీటి గురించి పెద్దగా పట్టించుకోరు. అయితే వాస్తవంగా చెప్పాలంటే పీచ్ పండ్లు మనకు ఎన్నో అద్భుతమైన లాభాలను అందిస్తాయి. ఈ పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

**విటమిన్ ఎ, సి అధికం..**

పీచ్ పండ్లలో విటమిన్ సి, ఎ అధికంగా ఉంటాయి. విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ మాదిరిగా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. విటమిన్ ఎ వల్ల కంటి చూపు మెరుగు పడుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పండ్లలో అధికంగా ఉండే పొటాషియం బీపీని నియంత్రిస్తుంది. రక్త సరఫరా మెరుగు పడేలా చేస్తుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. పీచ్ పండ్లలో ఉండే ఐరన్ రక్తం వృద్ధి చెందేలా చేస్తుంది. దీంతో రక్తహీనత తగ్గుతుంది. ఒక మీడియం సైజ్ పీచ్ పండులో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్దకం తగ్గేలా చేస్తుంది. ఈ పండ్లను తినడం వల్ల పొట్ట నిండుగా ఉన్న భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది.

**కంటి ఆరోగ్యానికి..**

పీచ్ పండ్లలో బీటా కెరోటిన్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది మన శరీరంలో విటమిన్ ఎ గా మార్పు చెందుతుంది. దీని వల్ల కళ్లు సురక్షితంగా ఉంటాయి. రేచీకటి రాకుండా అడ్డుకోవచ్చు. వయస్సు మీద పడడం వల్ల కళ్లలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. వృద్ధాప్యంలోనూ కళ్లు ఆరోగ్యంటా ఉంటాయి. పీచ్ పండ్లలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి కనుక ఇవి చర్మాన్ని సురక్షితంగా ఉంచుతాయి. విటమిన్ సి వల్ల కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఇది చర్మానికి సాగే గుణాన్ని అందిస్తుంది. అతినీలలోహిత కిరణాల బారి నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. కాలుష్యం వల్ల దెబ్బ తిన్న చర్మ కణాలకు మరమ్మత్తులు చేస్తుంది. దీంతో చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు తొలగిపోతాయి.

**బరువు తగ్గేందుకు..**

పీచ్ పండ్లలో క్యాలరీలు తక్కువగా, ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ పండ్లలో నీరు అధికంగా ఉంటుంది. కనుక బరువు తగ్గాలనుకుంటున్న వారు ఈ పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది. పీచ్ పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో సోడియం స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది. దీని వల్ల కిడ్నీలపై పడే భారం తగ్గుతుంది. కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే హైబీపీ ఉన్నవారికి మేలు జరుగుతుంది. పీచ్ పండ్లలో ఫినోలిక్ సమ్మేళనాలు. అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు.

ఇలా పీచ్ పండ్లను రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.



# ఆ కొబ్బరి నీళ్లు ప్రమాదమే!

ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన పానీయంగా ప్రజాదారణ పొందిన కొబ్బరి నీళ్లు మనకు ఎన్నో రకాలుగా మేలు చేస్తాయని తెలిసిందే! కానీ, కొన్నిసార్లు అవే కొబ్బరినీళ్లు కీడునూ తలపెడతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. 2021లో డెన్మార్క్‌కు చెందిన 69 ఏళ్ల వ్యక్తి.. పైకి తాజాగా కనిపించే కొబ్బరి నీళ్లు తాగాడు. అప్పటిదాకా ఆరోగ్యకరంగా కనిపించిన వ్యక్తి కొద్ది సమయంలోనే తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యాడట. తాను తాగిన కొబ్బరి నీళ్లలో 3-నైట్రోప్రొపియోనిక్ యాసిడ్ అనే ప్రాణాంతక టాక్సిన్ ఉత్పత్తై కొద్ది గంటల్లోనే అతనికి వికారం, వాంతులతో పాటు శరీరమంతా చెమటలు పట్టడం మొదలయ్యాయి.

మల్టీ ఆర్గాన్స్ పాడైపోయి చివరకు ఆ వ్యక్తి ప్రాణాలే కోల్పోయాడు. కొబ్బరి నీళ్లలో ఎలక్ట్రోలైట్, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. అయితే, అన్ని కొబ్బరి బోండాలూ సురక్షితం కాదన్న విషయం గుర్తించాలి. వెచ్చదనం, తేమతో కూడిన పరిస్థితుల్లో కొబ్బరిబొండాలను నిల్వ చేసినప్పుడు టెంకపై ఉండే చిన్న పగుళ్లద్వారా శిలీంద్రాలు కాయలోకి చొచ్చుకుపోతాయట. అయితే, పైకి మాత్రం ఆ బోండం తాజాగానే కనిపిస్తుంటుంది. లోపల మాత్రం విషపదార్థాలు ఉత్పత్తవుతాయి. ఇలాంటి బోండాల్లోని నీళ్లు నాడీ వ్యవస్థ, మెదడు, ముఖ్య అవయవాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని పరిశోధకులు చెబుతున్నారు.

# మేక నల్లాను తినడం వల్ల ఇన్ని లాభాలు ఉన్నాయా..? తెలిస్తే ఆశ్చర్యపోతారు..!



మటన్‌ను తినే చాలా మంది వాటికి చెందిన ఇతర భాగాలను కూడా ఎంతో ఇష్టంగా తింటుంటారు. భేజా, పాయా, బోటి, తలకాయ.. లాంటి వాటిని మటన్ ప్రియులు ఎక్కువగా తింటుంటారు. అయితే మేకకు చెందిన ఇంకో భాగం కూడా ఒకటి ఉంది. అదే నల్లా. దీన్ని కూడా చాలా మంది ఎంతో ఇష్టంగా తింటారు. నల్లాను వేపుడుగా చేసి తింటే ఎంతో రుచిగా ఉంటుంది. మన దేశంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పలు దేశాలకు చెందిన ప్రజలు కూడా మేక నల్లాను తింటుంటారు. ఇందులో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. నల్లాలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. దీన్ని శరీరం సులభంగా శోషించుకుంటుంది కూడా. కనుక రక్తం తక్కువగా ఉన్నవారు నల్లాను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. రక్తహీనత తగ్గుతుంది. ఐరన్ లోపం సమస్య పరిష్కరించబడుతుంది. నీరసం, అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తగ్గిపోతాయి.

**విటమిన్ బి12 అధికం..**

నల్లాలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. అందువల్ల దీన్ని తింటే కండరాలకు మరమ్మత్తులు జరుగుతాయి. కణజాలం వృద్ధి చెందుతుంది. హార్మోన్ల ఉత్పత్తి పెరుగుతుంది. హార్మోన్ల సమస్యలు తగ్గిపోతాయి. శరీర జీవక్రియలు సక్రమంగా నిర్వర్తించబడతాయి. నల్లాలో విటమిన్ బి12 అధికంగా ఉంటుంది. సాధారణంగా విటమిన్ బి12 జంతు సంబంధ పదార్థాల ద్వారా మనకు అధికంగా లభిస్తుంది. కనుక నల్లాను తింటుంటే ఈ విటమిన్ ను అధికంగా పొందవచ్చు. ఇది నాడీ మండల వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి దోహదం చేస్తుంది. చాలా మందికి విటమిన్ బి12 లోపం ఉంటుంది. వారు నాన్ వెజ్‌ను తింటే గనక నల్లాను తింటే ఎంతో మేలు జరుగుతుంది. దీంతో విటమిన్ బి12 లోపం నుంచి బయట పడవచ్చు.

**ఎముకల ఆరోగ్యానికి..**

నల్లాను తినడం వల్ల జింక్ అధిక మొత్తంలో లభిస్తుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. సీజనల్ వ్యాధులకు చెక్ పెడుతుంది. దగ్గు, జలుబు వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి. నల్లాలో ఉండే సెలీనియం ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. షుగర్ లెవల్స్‌ను నియంత్రిస్తుంది. దీంతో డయాబెటిస్ అదుపులో ఉంటుంది. నల్లాను తినడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. దీంతో ఉత్సాహంగా మారుతారు. చురుగ్గా ఉంటారు. శారీరక శ్రమ, వ్యాయామం చేసే వారికి నల్లా ఎంతో మేలు చేస్తుంది. నల్లాను తినడం వల్ల ఇలా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అయితే నల్లా ఆరోగ్యకరమే అయినప్పటికీ దీన్ని తినే విషయంలో ముందుగా పలు విషయాలను తెలుసుకోవాల్సి ఉంటుంది.

**జాగ్రత్తలు తప్పనిసరి..**

నల్లా మనకు అన్ని చోట్ల శుభ్రమైంది లభించదు. కొందరు మటన్ వ్యాపారులు శుభ్రత లేని చోట నల్లాను పట్టి తెచ్చి విక్రయిస్తారు. అలాంటి నల్లాలో బ్యాక్టీరియా, వైరస్, ఇతర క్రిములు ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాంటి నల్లాను తింటే ఫుడ్ పాయిజనింగ్ జరిగే ప్రమాదం ఉంటుంది. ఇది తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌కు సైతం దారి తీస్తుంది. కనుక నల్లాను తెచ్చుకునేటప్పుడు అది శుభ్రంగా ఉందా లేదా అన్న విషయాన్ని తెలుసుకున్నాకే తెచ్చుకోవాలి. లేదంటే అనారోగ్యాల బారిన పడతారు. నల్లాలో ఐరన్ అధికంగా ఉంటుంది కనుక ఐరన్ ట్యాబ్లెట్లు వాడేవారు దీన్ని తినకూడదు. తింటే శరీరంలో ఐరన్ అధికంగా పేరుకుపోతుంది. ఇది లివర్, గుండె, క్లోమం వంటి భాగాల్లో నిల్వ అవుతుంది. అనంతరం ఆయా అవయవాలకు నష్టం జరుగుతుంది. నల్లాను తెచ్చుకున్న తరువాత దాన్ని బాగా కడిగి శుభ్రం చేయాలి. అనంతరం దాన్ని బాగా ఉడికించాలి. దీంతో అందులో ఏమైనా క్రిములు ఉంటే నశిస్తాయి. నల్లాను తినడం ఆరోగ్యకరమే అయినా దీన్ని ఒక కప్పు మోతాదుకు మించి తినకూడదు. ఇలా జాగ్రత్తలను పాటిస్తూ దీన్ని తింటే లాభాలను పొందవచ్చు.



# ప్లాస్టిక్ దాడి తప్పించుకుందాం!

మీరు రోజూ ప్లాస్టిక్ తింటున్నారా? అదేంది.. మేమెందుకు తింటాం అంటారా? అయితే ఈ కింది వస్తువులు మీ వంటింట్లో ఉన్నాయంటే, మీరు కచ్చితంగా ప్లాస్టిక్ తింటున్నట్లే. మరి ఇప్పటికైనా అవేంటో తెలుసుకుని, వాటికి దూరంగా ఉండటం మంచిది.

**ప్లాస్టిక్ పాత్రలు**

చాలామంది తమకు తెలియకుండానే రోజువారీగా వంటగదుల్లో ఎన్నో ప్లాస్టిక్ పాత్రలు ఉపయోగిస్తున్నారు. స్పాటులా, టాంగ్స్, లాడల్స్ పేర్లతో రకరకాల ప్లాస్టిక్ చెంచాలతో వంటలు చేస్తున్నారు. కానీ ఇవన్నీ ఆరోగ్యానికి హానికరం. ముఖ్యంగా నల్లటి ప్లాస్టిక్ పాత్రలు మరింత హాని చేస్తాయంటున్నారు నిపుణులు. వీటిని ఎలక్ట్రానిక్ వేస్ట్ నుంచి తయారు చేస్తారట. వంట చేసేటప్పుడు వీటిని వినియోగిస్తే విషపూరితమైన మైక్రోప్లాస్టిక్స్ విడుదలవుతాయి. దానివల్ల హార్మోన్ల అసమానతలు ఏర్పడతాయి. అలాగే క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది. వీటికి ప్రత్యామ్నాయంగా చెక్క, స్టీల్ లేదా నాణ్యమైన సిలికాన్ చెంచాలు వాడొచ్చు.

కొన్నేళ్లుగా కత్తిపీట వాడకం పూర్తిగా తగ్గిపోయింది. ఎక్కువమంది ప్లాస్టిక్ కట్టింగ్ బోర్డులను తీసుకొచ్చి, వాటిపైనే కూరగాయలు, పండ్లు కోస్తున్నారు. అయితే తాజా అధ్యయనం ప్రకారం ప్లాస్టిక్ బోర్డుపై కోసే ప్రతిసారి 1,100 మైక్రోప్లాస్టిక్ పదార్థాలు ఆహారంలో కలుస్తాయట. దీనివల్ల కలిగే హాని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు కదా! ఈ ముప్పు తప్పాలంటే%ౌ% స్టీల్, ఉడెన్ కటింగ్ బోర్డులు వాడటం మంచిది. వీటిని కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. తడి పూర్తిగా ఆరిపోయేలా ఎండకు ఉంచాలి.

తక్కువ ధరలో లభిస్తాయనీ, పదార్థం మాడకుండా ఉంటుందనీ చాలామంది నాన్ స్టిక్ పాత్రలను వంటింట్లో వాడుతున్నారు. అయితే వీటిని బాగా వేడి చేసినప్పుడు, అందులోంచి ఆహారంలోకి హానికర రసాయనాలు విడుదలవుతాయి. కాబట్టి స్టెయిన్ లెస్ స్టీల్, ఇనుము, మట్టి పాత్రల్లో వంట చేసుకోవడం మంచిది.

ఈ మధ్య స్కూల్ లేదా కాలేజీకి వెళ్లే పిల్లలకు ప్లాస్టిక్ బాక్సుల్లోనే తల్లిదండ్రులు భోజనం కట్టి పంపిస్తున్నారు. అలాగే చపాతీలు లాంటి వాటిని ప్లాస్టిక్ కవర్లలో చుట్టేస్తున్నారు. ఇవి మైక్రో ప్లాస్టిక్స్, రసాయనాలను విడుదల చేసి ఆహారాన్ని కలుషితం చేస్తాయి. ప్లాస్టిక్ డబ్బాలకు చరమగీతం పాడండి. పిల్లలకు స్టీలు, గాజు బాక్సుల్లో భోజనం పెట్టడం మంచిది.



# డీఎన్ఏను మార్చేసే గోళ్ల రంగు!

గోరు చుట్టుపై రోకలి పోటు సామెత వినే ఉంటారు. అలాంటిదేనట గోళ్లకు వేసే నెయిల్ పాలిష్. గోళ్లరంగుతో ప్రమాదకరమైన ముప్పును కొని తెచ్చుకోవద్దని ఐరోపా దేశాలు ప్రజలకు సూచిస్తున్నాయి. అంతేకాదు హానికారక నెయిల్ పాలిష్‌లను నిషేధించాయి కూడా! ఈ నెల నుంచే ఐరోపాలోని అన్ని దేశాల్లో ట్రైఫినైల్ ఫాస్ఫైన్ ఆక్సైడ్ (టీపీవో) ఉపయోగించి తయారు చేసిన నెయిల్ పాలిష్‌లను వాడొద్దని ప్రజలకు సూచిస్తూ, నిషేధించింది. టీపీవో రసాయనం వల్ల నెయిల్ పాలిష్ మరింత కాంతివంతంగా మెరిసిపోతుంది. ఇది వేసుకున్నప్పుడు గోళ్లు మరింత ముచ్చటగా కనిపిస్తాయి. ఈ కెమికల్ ప్రాణాంతకమైందని ఇటీవల గుర్తించడమే ఈ నిషేధానికి కారణం. కణంలోని డీఎన్ఏలో శాశ్వతమైన మార్పులకు కారకంగా (మ్యూటాజెనిక్‌గా) ఈ టీపీవో పనిచేస్తుందని గుర్తించారట శాస్త్రవేత్తలు.

డీఎన్ఏ, కణం, అవయవాల్లో మార్పులకు కారణమయ్యే టీపీవోను కార్సినోజెనిక్ (క్యాన్సర్ కారకం)గా నిర్ధారించారు. ఇలాంటి నెయిల్ పాలిష్ వేసుకోవడం వల్ల క్యాన్సర్ ఒక్కటే కాదు, సంతాన సమస్యలు, చర్మ రోగాలు వస్తాయని గుర్తించారు. టీపీవో ఉన్న ఇతర సౌందర్య సాధనాలకు కూడా ఈ నిషేధం వర్తిస్తుందని యురోపియన్ దేశాలు తేల్చాయి. సెలూన్లు, బ్యూటీపార్లర్లు, కాస్మెటిక్ తయారీదారులు అత్యంత ప్రమాదకరమైన టీపీవో రసాయనానికి బదులుగా బెంజోయల్ పెరాక్సైడ్ (బీపీవో) లేదా తక్కువ ప్రమాదకరమైన రసాయనాలను ఉపయోగించాలని సూచిస్తున్నాయి. ఇది ఐరోపా ప్రజలకే వర్తించే చట్టమే అయినప్పటికీ ప్రపంచంలోని ప్రజలందరూ గుర్తించాల్సిన హెచ్చరిక, ఆరోగ్య సూచన. అందం కన్నా అందమైన జీవితమే ముఖ్యం అనుకుని జెల్ నెయిల్ పాలిష్ కొనేటప్పుడు అందులోని రసాయనాలను శ్రద్ధగా చదివి కొనాలని నిపుణుల మాట.

# కేకేఆర్‌లో నాకు గౌరవం దక్కలేదు

**అందుకే కేకేఆర్ నుండి బయటకు వచ్చా**

**శ్రేయాస్ అయ్యర్ కీలక వ్యాఖ్యలు**




ఐపీఎల్ 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు టైటిల్ అందించిన శ్రేయాస్ అయ్యర్ ఆ వెంటనే జట్టును వీడాడు. అసలు కేకేఆర్ నుంచి ఎందుకు బయటకు వచ్చాడని అప్పట్లో తెగ రూమర్స్ వచ్చాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో వాటన్నింటికి క్లారిటీ ఇచ్చాడు. పంజాబ్ కింగ్స్‌లో తనకు లభించిన గౌరవం కేకేఆర్‌లో లేదని తెలిపాడు. పంజాబ్ జట్టులో స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోగలిగానని, కేకేఆర్‌లో మాత్రం చర్చల్లో భాగస్వామినే కానీ పూర్తి స్వేచ్ఛ లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.ఐపీఎల్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా పేరు తెచ్చుకున్న శ్రేయాస్ అయ్యర్.. కోల్‌కతా నైట్ రైడర్స్‌కి ట్రోఫీ అందించి బయటకొచ్చాడు. కేకేఆర్ ఫ్రాంఛైజీనే అయ్యర్‌ని వదిలేసిందని కొందరు అంటుంటే.. తానే బయటకు వచ్చానని శ్రేయాస్ అయ్యర్ అంటున్నాడు. పంజాబ్ కింగ్స్‌లో దక్కిన గౌరవం.. కేకేఆర్‌లో లేదంటూ తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్‌కు చేర్చి వెంట్రుకవాసిలో టైటిల్‌ను కోల్పోయిన శ్రేయాస్ అయ్యర్ .. కేకేఆర్‌లో తాను పూర్తిగా ఇమడలేక పోయానని ఎమోషనల్ అయ్యారు. చర్చల్లో భాగంగా మాత్రమే ఉన్నానని, కానీ పూర్తి స్థాయి స్వేచ్ఛ దక్కలేదని చెప్పాడు. అయితే, పంజాబ్ కింగ్స్ మేనేజ్‌మెంట్, కోచ్‌లు మాత్రం తన మాట వినాలనే తపన చూపారని.. అందుకే కెప్టెన్సీలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకున్నానంటూ వెల్లడించాడు. నేను కెప్టెన్‌గా, ఆటగాడిగా జట్టుకు చాలా ఇస్తాను. నాకు గౌరవం దక్కితేనే అన్నీ సాధ్యమవుతాయి. పంజాబ్ కింగ్స్‌లో అదే జరిగింది. అక్కడ కోచ్‌లు, మేనేజ్‌మెంట్, ఆటగాళ్లు.. అందరూ నాకు అండగా నిలిచాడు. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన ఉత్సాహంతో జట్టులో చేరినప్పుడు వాళ్లంతా నా మాట వినాలనే తపన చూయించారు. ఆ కారణంతోనే మైదానంలో, బయటా నేను స్పష్టమైన నిర్ణయాలు తీసుకోగలిగాను. మేనేజ్‌మెంట్, కోచ్‌లతో జరిగే ప్రతి మీటింగ్‌లో పాల్గొని వ్యూహాత్మకంగా సహకరించడం నాకు చాలా ఇష్టం” అని తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు.ఐపీఎల్ 2024 టైటిల్ గెలిచిన తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్ నుంచి శ్రేయాస్ అయ్యర్ బయటకు రావడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే, తాను తీసుకున్న నిర్ణయం వెనుక తెలియని బాధ ఉందని శ్రేయాస్ మాటల్లోనే తెలిసింది. కేకేఆర్‌లో కెప్టెన్‌గా వ్యవహరించినప్పటికీ, పంజాబ్‌లోలా పూర్తి స్వేచ్ఛతో వ్యవహరించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. కేకేఆర్‌లో నేను చర్చల్లో భాగమే అయినా.. పూర్తిగా ఇమడలేక పోయాను. కానీ ఇప్పుడు ఉన్న స్థాయికి రావడానికి మాత్రం చాలా కష్టపడ్డాను అని శ్రేయాస్ అయ్యర్ వెల్లడించాడు. ఐపీఎల్, దేశవాళీ, వన్డే క్రికెట్‌లో రాణించిన శ్రేయాస్ అయ్యర్‌ను బీసీసీఐ పూర్తి స్థాయిలో గుర్తించకపోవడం బాధాకరం. ఐపీఎల్ తర్వాత ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో ఛాన్స్ ఇవ్వని బీసీసీఐ, ఆసియా కప్ 2025 స్క్వాడ్‌లో కూడా మొండిచేయి చూయించింది. శ్రేయాస్‌ను కావాలనే పక్కనబెడుతున్నారన్న విమర్శలు ఎక్కువవ్వడంతో.. ఆస్ట్రేలియా ఏతో జరిగే అనధికారిక నాలుగు రోజుల టెస్టు సిరీస్‌లో భారత్ ఏ జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక చేశారు.

# గంభీర్ వ్యూహాలతో జట్టు కూర్పులో మార్పులు

## ఒక స్పిన్నర్, ముగ్గురు పేసర్లతో బరిలోకి టీమిండియా

**తుది జట్టులో జితేశ్ శర్మకు అవకాశం దక్కేనా?**

**కుల్దీప్ యాదవ్‌కు మరోసారి నిరాశే..!?**

**ఆసియా కప్ పై టీమిండియా తీవ్ర కసరత్తు**




ఆసియా కప్‌లో కుల్దీప్ యాదవ్‌కు మరోసారి నిరాశ ఎదురుకానుంది. యూఏఈతో జరిగే మ్యాచ్‌లో భారత్ ఒక స్పిన్నర్, ముగ్గురు సీమర్లతో బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. వరుణ్ చక్రవర్తి స్పిన్ బాధ్యతలు చేపట్టనుండగా, ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, శివమ్ దుబే కూడా జట్టులో స్థానం సంపాదించారు. సంజూ శాంసన్‌ను కాదని జితేశ్ శర్మకు అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వ్యూహాలతో జట్టు కూర్పులో మార్పులు చోటుచేసుకుంటున్నాయి.టీమిండియా మిస్టీరియస్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కి మళ్లీ మొండిచేయే దక్కనుంది. ఆసియా కప్ టీమిండియా ఆరంభ మ్యాచ్‌లో ఊహించని మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్స్‌లో న్యూజిలాండ్‌లో ఆడిన తర్వాత మళ్లీ ఇప్పటి వరకు కుల్దీప్ యాదవ్ ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఆడిందే లేదు. అయితే, దుబాయ్ వేదికగా జరిగే ఆసియా కప్‌లో అయినా తన సత్తా చూపాలని కుల్దీప్ భావించినా.. ఇక్కడా నిరాశే మిగిలేట్టు ఉంది. యూఏఈతో జరిగే మ్యాచ్‌లో భారత్ కేవలం ఒక స్పెషలిస్ట్ స్పిన్నర్, ముగ్గురు సీమర్లతో బరిలోకి దిగాలని అనుకుంటోంది. ఆసియా కప్ 2025లో భాగంగా భారత్ - యూఏఈ మధ్య జరిగే మ్యాచ్‌లో టీమిండియా స్పిన్ అటాక్‌లో వరుణ్ చక్రవర్తి ఒక్కడే ఉంటాడని తెలుస్తోంది. వరుణ్‌తో పాటు ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ కూడా బౌలింగ్ చేయనున్నాడు. ఇంకా అవసరమైతే అభిషేక్ శర్మ సేవలు కూడా ఉపయోగించుకుంటామని బీసీసీఐ గతంలోనే చెప్పింది. టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా కుల్దీప్ యాదవ్ ప్లేయింగ్ 11లో ఉండడు అనే చెబుతున్నాడు. “అతను చాలా ప్రొఫెషనల్ అథ్లెట్. ఇంగ్లండ్ టూర్‌లో మ్యాచ్‌లు ఆడకపోయినా నిరంతరం కష్టపడ్డాడు. అతను తన శిక్షణలో దృష్టి పెట్టి, లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తున్నాడు. ఇప్పుడు మన చేతిలో ఉన్నది ట్రైనింగ్ సమయంలో గడిపే ప్రతి ఓవర్‌కి అర్థవంతమైన ఉద్దేశం ఇవ్వడం మాత్రమే” అని మోర్కెల్ అన్నాడు.టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జట్టులో ఆల్‌రౌండర్లదే హవాగా మారింది. స్పిన్ ఆల్‌రౌండర్, పేస్ ఆల్‌రౌండర్లనే ప్లేయింగ్ 11లో ఎంపిక చేస్తున్నారు. కేవలం టీ20లే కాకుండా ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో కూడా గంభీర్ ఇదే వ్యూహాన్ని అమలు చేసి వాషింగ్టన్ సుందర్‌కి ఛాన్స్ ఇచ్చాడు. ఆసియా కప్‌లో హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్‌తో పాటు శివమ్ దుబేని మూడో ఆల్‌రౌండర్‌గా ఫిట్ చేస్తున్నారు. రవీంద్ర జడేజా టీ20ల నుంచి రిటైర్డ్ అయిన తర్వాత ఆ స్థానాన్ని దుబేతో ఫిల్ చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. యూఏఈపై జరగనున్న తొలి మ్యాచ్‌లో సంజూ శాంసన్‌ను పక్కనబెట్టి యువ ఆటగాడు జితేశ్‌ని బరిలోకి దింపాలని టీమిండియా చూస్తోంది. నెట్ సెషన్‌లో కనిపించిన దాని ప్రకారం జితేశ్‌తో ఎక్కువ కీపింగ్ ప్రాక్టీస్ చేయించారు. సంజూ ఓపెనర్ స్థానాన్ని శుభమన్ గిల్‌తో భర్తీ చేసి జితేశ్‌ను నెంబర్ 7లో ఆడించాలని గౌతమ్ గంభీర్ చూస్తున్నట్లు అర్థమవుతోంది. బౌలింగ్ విభాగంలో జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్ మెయిన్ సీమర్లుగా రానున్నారు. మూడో పేసర్‌గా హర్షిత్ రాణా ఎంపికపై ప్రస్తుతానికి ఎలాంటి క్లారిటీ లేదు. మొదటి మ్యాచ్ నుంచే రాణాని ఎంపిక చేయడం ఎందుకనే ఆలోచనలో బీసీసీఐ ఉంది. మొత్తం మీద ముగ్గురు సీమర్లు, ఒక స్పెషలిస్ట్ స్పిన్నర్‌తో టీమిండియా రేపు యూఏఈపై బరిలోకి దిగనుంది.

**టీమిండియా జట్టు అంచనా**

అభిషేక్ శర్మ, శుభమన్ గిల్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శివమ్ దుబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్.




# గ్రేట్ బ్యాటర్ల జాబితాలో రోహిత్ శర్మకు చోటు లేదు

## కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ వివాదాస్పద వ్యాఖ్యలు

టీమిండియా ఆల్‌టైమ్ గ్రేట్ బ్యాటర్ల జాబితాలో వన్డే కెప్టెన్ రోహిత్ శర్మకు చోటు లేదని వివాదాస్పద కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ అన్నాడు. సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాల స్థాయికి రోహిత్ శర్మ చేరుకోలేదన్నాడు. తాజాగా దూరదర్శన్‌లో వచ్చే గ్రేట్ ఇండియన్ క్రికెట్ షాలో పాల్గొన్న సంజయ్ మంజ్రేకర్ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ అసాధారణ ప్రదర్శన కనబర్చినా.. దిగ్గజాల స్థాయిని అందుకోలేకపోయాడని అభిప్రాయపడ్డాడు.’నా అభిప్రాయం ప్రకారం టీమిండియా ఆల్‌టైమ్ గ్రేట్ బ్యాటర్ల జాబితాలో రోహిత్ శర్మ లేడు. అందుకు అతను సరిపోడు. ఎందుకంటే సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాల స్థాయిని రోహిత్ శర్మ చేరుకోలేదు. అయితే కెప్టెన్‌గా రోహిత్ శర్మకు తిరుగులేదు. అతని స్వార్థరహిత కెప్టెన్సీని కచ్చితంగా కొనియాడాల్సిందే. ముఖ్యంగా 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత ప్రజల్లో అతనిపై ఉన్న ప్రేమ మరింత రెట్టింపు అయ్యింది. అతను ఎప్పుడూ తన గురించి ఆలోచించలేదు. జట్టు కోసం తన స్వప్రయోజనాలను కూడా త్యాగం చేసేందుకు సిద్దమయ్యాడు. అదే అతన్ని పత్యేకంగా నిలబెట్టింది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అతని ఆధిపత్యం చూడముచ్చటగా ఉండేది.ఒకే వన్డే ఇన్నింగ్స్‌లో అలవోకగా 300 పరుగులు చేసేంత ఆధిపత్యం చెలాయించేవాడు. కానీ భారత ఆల్‌టైమ్ గ్రేట్ బ్యాటర్ల గురించి మాట్లాడినప్పుడు టెస్ట్ క్రికెట్‌ను కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ రెడ్ బాల్ ఫార్మాట్‌లో రోహిత్ శర్మ అంతగా ప్రభావం చూపలేదు. అందుకే అతను భారత ఆల్‌టైమ్ గ్రేట్ బ్యాటర్లలో ఒకడు కాదని చెబుతున్నా.’అని సంజయ్ మంజ్రేకర్ పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్యలపై రోహిత్ ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోహ్లీ, సచిన్, గవాస్కర్ కంటే కూడా రోహిత్ గొప్ప ఆటగాడు, నాయకుడని కామెంట్ చేస్తున్నారు. రోహిత్ సారథ్యంలో భారత్ రెండు ఐసీసీ టైటిళ్లు గెలిచిందని గుర్తు చేస్తున్నారు. సంజయ్ మంజ్రేకర్‌కు బుద్ధి లేదని ఘాటుగా విమర్శిస్తున్నారు.సంజయ్ మంజ్రేకర్ చెప్పినట్లు టెస్ట్ క్రికెట్‌లో రోహిత్ శర్మకు గొప్ప రికార్డ్ లేదు. కానీ అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన నాలుగో భారత బ్యాటర్‌గా హిట్ మ్యాన్ కొనసాగుతున్నాడు. మూడు ఫార్మాట్లలో కలిపి అతను 19,700 పరుగులు చేశాడు. 67 టెస్ట్‌ల్లో 4301 పరుగులు చేసిన హిట్ మ్యాన్.. వన్డేల్లో 11, 168 రన్స్ చేశాడు. వన్డే ఫార్మాట్‌లో మూడు డబుల్ సెంచరీలు బాదిన ఏకైక బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. అంతేకాకుండా అత్యధిక వ్యక్తిగత స్కోర్ (264) రికార్డ్ కూడా రోహిత్ పేరిటే ఉంది. టీ20లతో పాటు టెస్ట్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ.. వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు.

# మేము కేవలం క్రీడాకారులం

**సంఘటనపై ఎలా స్పందించాలో తెలియలేదు**

**ఆటగాళ్లందరినీ తీవ్ర షాక్‌కు గురి చేసింది**

**అప్పుడు ఏం జరిగిందో కూడా మాకు అర్థం కాలేదు**

**బెంగళూరు విషాదంపై దినేష్ కార్తీక్ స్పందన**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ 2025 టైటిల్ గెలిచిన తర్వాత బెంగళూరులో అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ సంబరాల సందర్భంగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వెలుపల జూన్ 4, 2025న జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. లోపల ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా, వెలుపల అభిమానులు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఆర్‌సీబీ ఫ్రాంఛైజీ, ఆటగాళ్లు స్పందించకపోవడంపై కూడా చాలామంది ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై చాలా నెలల పాటు మౌనంగా ఉన్న ఆర్‌సీబీ బ్యాటింగ్ కోచ్ దినేష్ కార్తీక్, ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్‌లో మొదటిసారి మాట్లాడారు. ఆ రోజు జరిగిన సంఘటనను ఆయన గుర్తు చేసుకుంటూ.. ఆ విషాదం తమ ఆటగాళ్లందరినీ తీవ్ర షాక్‌కు గురి చేసిందని చెప్పారు. ఆటగాళు ఏం మాట్లాడాలో, ఎలా స్పందించాలో తెలియని స్థితిలో ఉన్నారని ఆయన అన్నారు. “మేము బెంగళూరులో ఉన్నాము. మేము ఒక ఈవెంట్‌కు వెళ్లమని చెప్పారు. కానీ మేము అక్కడికి వెళ్ళినప్పుడు మమ్మల్ని వెనక్కి పంపించారు. అప్పుడు ఏం జరిగిందో కూడా మాకు అర్థం కాలేదు. మేము కేవలం క్రీడాకారులం. ఇలాంటి సంఘటన జరిగినప్పుడు ఎలా స్పందించాలో తెలియదు. ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పినప్పుడు, దానిని ఎలా మార్చగలం. అది మారి ఉంటే బాగుండు అని కోరుకుంటున్నాను” అని దినేష్ కార్తీక్ చెప్పారు. ఆ విషాదం తర్వాత ఆటగాళ్లంతా మౌనంగా ఉండిపోయారని కార్తీక్ తెలిపారు. “ఆర్‌సీబీకి అంత పెద్ద అభిమానుల బలం ఉంది. కానీ, ఆ సంఘటన మా సంబరాలన్నింటినీ నాశనం చేసింది. నేను చూసిన వాటిలో అది అత్యంత బాధాకరమైన విషయాలలో ఒకటి. ఆ తల్లిదండ్రులు, కుటుంబాలు ఎలాంటి బాధను అనుభవిస్తున్నారో నేను ఊహించలేను. వారికి ఏదో ఒక విధంగా సహాయం చేయగలమని నేను ఆశిస్తున్నాను” అని ఆయన అన్నారు. ఈ దుర్ఘటన జరిగిన దాదాపు మూడు నెలల తర్వాత ఆగస్టు 28న ఆర్‌సీబీ దీనిపై స్పందించింది. బాధితుల కుటుంబాలను ఆదుకోవడానికి ఒక కార్యక్రమాన్ని ప్రకటించింది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా నిరోధించడానికి ఆర్‌సీబీ కేర్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆ సోషల్ మీడియా పోస్ట్‌లోనే దినేష్ కార్తీక్ మొదటిసారిగా స్పందించి, బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. “జూన్ 4న తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలందరికీ నా హృదయపూర్వక సానుభూతి. మీరు పడిన బాధను నేను ఊహించలేను. ఈ క్లిష్ట సమయంలో మీకు శక్తి ఇవ్వాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను” అని ఆయన పేర్కొన్నారు.

ఆర్‌సీబీ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా, అభిమానుల భద్రత కోసం ఒక మానిఫెస్టోను ప్రకటించింది:

1. ఆర్థిక సహాయానికి మించిన మద్దతు: బాధిత కుటుంబాలకు వేగంగా, పారదర్శకంగా సహాయం అందిస్తుంది.

2. సురక్షితమైన వాతావరణం కల్పించడం: స్టేడియం అధికారులు, క్రీడా సంస్థలు, లీగ్ భాగస్వాములతో కలిసి గ్రూప్ నిర్వహణ ప్రోటోకాల్‌లను రూపొందిస్తుంది.

3. కమ్యూనిటీలకు అవకాశాలు కల్పించడం: గ్రామీణ కర్ణాటకలోని సిద్ధి కమ్యూనిటీతో ప్రారంభమైన సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తుంది.

4. స్వతంత్ర పరిశోధన, సేఫ్టీ పై పెట్టుబడి: ఫ్యాన్-సేఫ్టీ ఆడిట్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించి, మైదానంలో పనిచేసే సిబ్బందికి గ్రూప్ మెయింటెనెన్స్, అత్యవసర ప్రతిస్పందనపై ప్రత్యేక ట్రైనింగ్ ఇస్తుంది.

5. అభిమానుల జ్ఞాపకాలను శాశ్వతం చేయడం: బెంగళూరులో ఆర్‌సీబీ అత్యంత గొప్ప అభిమానుల పేర్లు, కథలు, స్ఫూర్తిని గౌరవించడానికి ఒక ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేస్తుంది.

6. క్రీడల ద్వారా భవిష్యత్తును నిర్మించడం: జట్టుపై విశ్వాసం కేవలం స్టాండ్స్‌కే పరిమితం కాకుండా, స్టేడియంలో ఉద్యోగాలు కల్పించడం, స్థానిక ప్రతిభను పోషించడం, భవిష్యత్ క్రీడా నిపుణులకు మద్దతు ఇస్తుంది.

ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పినప్పుడు, దానిని ఎలా మార్చగలం. అది మారి ఉంటే బాగుండు అని కోరుకుంటున్నానని అన్నారు.





# హైదరాబాద్, విజయవాడల్లో ఓజీ ప్రీ రిలీజ్ ఈవెంట్స్

## హైదరాబాద్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా చిరు ?




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'ఓజీ' సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ, అభిమానుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా, సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఈ నెల 19న విజయవాడ, 21న హైదరాబాద్ లో రెండు భారీ ప్రీ-రిలీజ్ ఈవెంట్లు- నిర్వహించనున్నట్లు- సమాచారం. హైదరాబాద్ ఈవెంట్‌కు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశముందని సినీ వర్గాల్లో బలమైన చర్చ సాగుతోంది. తమ్ముడు పవన్ కళ్యాణ్ సినిమాకు అన్నయ్య చిరంజీవి వస్తే, అది మెగా ఫ్యాన్స్‌కి డబుల్ సెలబ్రేషన్ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. చిరు-పవన్ కలిసి చాలా కాలం తరువాత ఒకే వేదికపై కనిపించనుండడం ఈ ఈవెంట్‌కు మరింత ప్రత్యేకతను తెస్తుంది. 'ఓజీ' పై అంచనాలు నేడు దేశీయ మార్కెట్‌లో మాత్రమే కాదు, విదేశాల్లో కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. నార్త్ అమెరికాలో ఇప్పటికే లక్షలాది టికెట్లు అడ్వాన్స్ బుకింగ్‌లో అమ్ముడవుతున్నాయి. అక్కడి డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు ఈ ఫిల్మ్ పెద్ద హిట్టు- అని ముందే ఊహిస్తున్నాయి. టీజర్, గ్లింప్స్, సాంగ్స్‌కు భారీ రెస్పాన్స్ రావడం వలన ఈ క్రేజ్ మరింత పెరిగింది. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ గ్యాంగ్‌స్టర్ లుక్‌లో కనిపించనున్నట్లు- సమాచారం. అంతేకాదు, డ్యూయెల్ పాత్ర పోషించినట్లు- ఇండస్ట్రీ టాక్. ఈ చిత్రం ద్వారా పవన్ తన ఫ్యాన్స్‌కి మళ్లీ మాస్ ట్రీ-ట్ ఇవ్వాలని ఫిక్స్ అయిపోయాడు. ఇటీ-వల హరిహర వీరమల్లుతో నిరాశలో ఉన్న అభిమానులు, క్షఏ ద్వారా ఊపిరి పీల్చుకోవాలని భావిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా చేస్తున్నాయి . ఓజీ బ్యాగ్రౌండ్ స్కోర్ మరో లెవెల్‌లో ఉండబోతుందని టాక్. ఈ సినిమా కోసం థమన్ బాగానే హార్డ్ వర్క్ చేస్తున్నాడట.



# మమ్ములను శత్రువుల్లా ఎందుకు చూస్తున్నారు

## మేమేం తప్పు చేశాం..నటుడు మోహన్ లాల్

అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ అధ్యక్షురాలిగా శ్వేతా మేనన్ ఇటీవల ఎన్నికయ్యారు. ఆమె కంటే ముందు ఆ పదవిలో ఉన్న మోహన్‌లాల్ తాను రాజీనామా చేసేందుకు దారితీసిన పరిస్థితుల గురించి తాజాగా మాట్లాడారు. తనతో పాటు, తన కార్యనిర్వాహక కమిటీ-లోని ఇతర సభ్యులను చాలామంది శత్రువుల్లా చూస్తున్నారన్నారు. అధ్యక్షుడు అనేది కేవలం ఒక పదవి. ఏదైనా సమస్య వస్తే దానికి అధ్యక్షుడు ఒక్కడే కారణమా? చాలామంది నాపై శత్రుత్వం పెంచుకున్నారు. అలా అని అందరూ నన్ను ద్వేషించారని నేను చెప్పడం లేదు. ఏదేమైనా నన్ను శత్రువులా ఎందుకు చూస్తున్నారో ఇప్పటికీ అర్థంకావడం లేదు. నాతోపాటు- రాజీనామా చేసిన ఇతర వ్యక్తులు తిరిగి కమిటీ-లోకి వస్తారా, లేదా అనేది పూర్తిగా వారి నిర్ణయం. అధ్యక్షురాలిగా శ్వేతా మేనన్‌ను ఎన్నుకోవడం గొప్ప విషయం. ఎందుకంటే గతంలో మహిళలు చర్చించలేకపోయిన విషయాలు ఇప్పుడు వారు సంకోచం లేకుండా చర్చించుకోవచ్చు. 'అమ్మ'కు సపోర్ట్ ఇవ్వడానికి నేనెప్పుడూ సిద్ధంగానే ఉంటాను అని తెలిపారు. ఇక అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్‌కు నాయకత్వం వహించడానికి యువకులు ఎందుకు ముందుకురావడం లేదనే ప్రశ్నకు మోహన్‌లాల్ సమాధానమిచ్చారు. 'యువకులు ముందుకురావాలని మనం అనుకుంటే సరిపోదు. వారు బాధ్యత తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలి. బహుశా వారికి అంత సహనం లేదేమో' అని తెలిపారు. మలయాళ చిత్ర పరిశ్రమపై జస్టిస్ హేమ కమిటీ- గతేడాది ఓ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ చిత్ర సీమలో పనిచేసే మహిళలు క్యాస్టింగ్ కౌచ్, లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని ఆ నివేదికలో హేమ కమిటీ- పేర్కొంది. దీంతో అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ అప్పటి అధ్యక్షుడు మోహన్‌లాల్ రాజీనామా చేశారు. ఆయనతో పాటు 17 మంది సభ్యులు ఉన్న మొత్తం పాలక మండలి తమ పదవుల నుంచి వైదొలిగింది.



## ఆశలన్నీ ప్రభాస్ మీదే పెట్టుకుంది...!

మలయాళి ముద్దుగుమ్మ మాళవిక మోహనన్ ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్ద కాలంకు పైగా అయింది. అయితే ఇప్పటి వరకు ఒకటి రెండు సినిమాలు తప్ప పెద్దగా విజయాలను ఈమె సొంతం చేసుకోలేక పోయింది. హీరోయిన్‌గా ఈమె చేస్తున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఫలితాలను అందించడంలో విఫలం అవుతున్నాయి. గత ఏడాది ఈమె నటించిన తంగలన్ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ఫలితం తారుమారు అయింది, అంతే కాకుండా ఆ సినిమాలో ఈమె పోషించిన పాత్ర కారణంగా అసలు ఉందా లేదా అన్నట్లుగా కామెంట్స్ వచ్చాయి. ప్రస్తుతం మాళవిక మోహనన్ చేతిలో అరకొర సినిమాలు మాత్రమే ఉన్నాయి. అందులో ప్రభాస్‌తో నటిస్తున్న రాజాసాబ్ ఒకటి అనే విషయం తెల్సిందే. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రాజాసాబ్ సినిమాలో ముగ్గురు హీరోయిన్స్ నటిస్తున్న విషయం తెలిసిందే. ముగ్గురు హీరోయిన్స్‌లో ఒక హీరోయిన్‌గా మాళవిక మోహనన్ నటిస్తోంది. ఇప్పటికే ఈమె పార్ట్ షూటింగ్ పూర్తి అయిందని సమాచారం. రాజాసాబ్ ఈ ఏడాది ఆరంభంలో విడుదల కావాల్సి ఉండగా అనేక కారణాల వల్ల సినిమా వాయిదా పడుతూ వచ్చింది. మొదట ప్రభాస్ బిజీగా ఉండటం వల్ల షూటింగ్ ఆలస్యం అయింది, ఆ తర్వాత వీఎఫ్ఎక్స్ కారణంగా ఆలస్యం అవుతూ వస్తోంది. ఈమధ్య కాలంలో ఎక్కువ సినిమాలు వీఎఫ్ఎక్స్ ఆలస్యం కారణంగా వాయిదా పడుతూ వస్తున్న విషయం తెల్సిందే. ఈ సినిమాపై ఆశలు పెట్టుకుని మాళవిక మోహనన్ ఎదురు చూస్తున్న విషయం తెల్సిందే.



## యాక్సిడెంట్ వార్తలు అబద్ధం: నటి కాజల్

అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్‌కు యాక్సిడెంట్ అయిందని పరిస్థితి విషమంగా ఉందంటూ సోషల్ మీడియాలో కొన్ని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిపై కాజల్ స్పందించారు. తాను క్షేమంగానే ఉన్నానని ఆ వార్తలన్నీ రూమర్స్ మాత్రమేనని చెప్పారు. కాజల్‌కు యాక్సిడెంట్ అయిందనే వార్తలు సోమవారం సాయంత్రం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఆందోళన చెందిన అభిమానులు ఆమెను ట్యాగ్ చేస్తూ పోస్ట్‌లు పెట్టారు. దీనిపై కాజల్ స్పందిస్తూ ఈ వార్తలను ఖండించారు. నిజం చెప్పాలంటే అవి చూసి నేను నవ్వుకున్నాను. ఎందుకంటే ఇంతకుమించిన ఫన్నీ న్యూస్ ఉండదు. అవన్నీ పూర్తి అవాస్తవం. దేవుడి దయ వల్ల నేను క్షేమంగా, సురక్షితంగా ఉన్నాను. ఇలాంటి తప్పుడు వార్తలు నమ్మొద్దు, ప్రచారం కూడా చేయొద్దని మీ అందరినీ అభ్యర్థిస్తున్నాను. ఇలాంటి ఫేక్ న్యూస్‌లను షేర్ చేసే బదులు ఏవైనా నిజమైన వార్తలను నలుగురితో పంచుకోండి అంటూ నోట్ విడుదల చేశారు.



# ఎఐ సాయంతో అశ్లీల కంటెంట్

## హైకోర్టును ఆశ్రయించిన నటి ఐశ్వర్యారాయ్

బాలీవుడ్ స్టార్ నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. తన అనుమతి లేకుండా తన ఫోటోలతో పాటు- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సృష్టించబడుతున్న అశ్లీల చిత్రాలను అడ్డుకోవాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు- ఐశ్వర్య పేర్కొంది. అయితే ఈ కేసు నేడు విచారణకు రాగా.. ఐశ్వర్య తరపున వాదించిన సీనియర్ అడ్వకేట్ సందీప్ సేథీ మాట్లాడుతూ.. ఐశ్వర్య రాయ్ చిత్రాలు కానీ, రూపం కానీ ఉపయోగించుకునే హక్కు ఎవరికీ లేదు. ఒక వ్యక్తి ఆమె పేరు ముఖాన్ని ఉపయోగించి ఆఒ ద్వారా డబ్బు సంపాదిస్తున్నాడు అని సేథీ వాదించారు. ఆమె పేరు రూపం ఎవరిదో లైంగిక కోరికలు తీర్చడానికి ఉపయోగించబడుతోంది. ఇది చాలా దురదృష్టకరం అని ఆయన కోర్డు ముందు పేర్కొన్నారు. అయితే ఐశ్వర్య పిటిషన్‌ని విచారించిన జస్టిస్ తేజస్ కరియా దీనిపై ప్రతివాదులకు వ్యతిరేకంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తామని సూచించింది. ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 7న జాయింట్ రిజిస్ట్రార్ ముందుకి.. ఆ తర్వాత జనవరి 15, 2026న కోర్టు ముందుకి వాయిదా వేసినట్లు- హైకోర్టు తెలిపింది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463